# వరద ముంపులో ఆర్టీసి బస్సు

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం

నెక్కొండకు తరళివచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ

ప్రయాణికులకు తగిన సౌకర్యాల ఏర్పాట్లు



2లో..




వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

సోమవారం 2, సెప్టెంబర్ 2024 | 16 పేజీలు


# గర్జించిన వరుణుడు... వరదల్లో ఓరుగల్లు





- జలమయమైన పలు ప్రాంతాలు
- పొంగిపోర్లుతున్న వాగులు
- వందల ఎకరాల్లో పంట నష్టం
- నిండుకుండలను తలపిస్తున్న గ్రామాలు
- మత్తడి పోస్తున్న చెరువులు
- జల దిగ్బంధంలో ఓరుగల్లు నగరం
- నీట మునిగిన కాలనీలు



**హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండ పోతగా వర్షంతో ఓరుగల్లు ఉమ్మడి జిల్లా నీటమునిగింది. ఓరుగల్లు నగరంలోని వందల కాలనీలు జలమయమైనాయి. ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలలో 43 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఓరుగల్లులోని హన్మకొండ, వరంగల్, కాజిపేటతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు పలు గ్రామాలు నీటమునిగాయి. ఓరుగల్లు నగరంలోని హన్మకొండ, వరంగల్, కాజిపేట ట్రైసిటీలోని వందలకు పైగా కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు కాలనీలైన పలు కాలనీల్లోని ఇండ్లకు వరద నీరు రావడంతో నగరంలోని కాలనీ వాసులు తమ ఇండ్లలోని నీళ్లు ఎత్తిపోస్తూ బిక్కు బిక్కుమం టున్నారు. లోతట్టు ప్రాంతాల వారు తమ ఇండ్లపైకి ఎక్కి వర్షానికి వనుకుతున్నారు.

వివరాలు 2లో

# దంచికొట్టిన వాన...

- ఉరకలెత్తుతు ప్రమాదకరంగా పొంగుతున్న వాగులు
- నిండుకుండల్లా నిండి మత్తడి దుంకుతున్న చెరువులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ములుగు జిల్లాలో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- బోగత జలపాతం సందర్శన నిలిపివేత



2 లో..

**ములుగు జిల్లా, ప్రభాతవార్త:** ములుగు జిల్లాలో శనివారం ఉదయం నుండే భారీ వర్షాలు కురుస్తున్నాయి.మేఘానికి చిల్లుపడిందా అన్నట్లుగా కురిసిన జోరువానకు ఏజెన్సీ ప్రాంతంలోని లోతట్టు రహదారులన్నీ పూర్తిగా జలమయైనాయి. దంచికొట్టిన వానకు జిల్లాలో ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. బయటకు వెళ్లకుండా జోరు వాన కొనసాగింది. అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి.

# మరుపురాని నెత్తుటి మరక!



2లో..

**పరకాల- ప్రభాతవార్త:** నిజాం రజాకార్ల నిరంకుశత్వం... గులాం గిరికి తలవంచమని తిరుగబడ్డ వీరులు... భూమి కోసం, భుక్తి కోసం... స్వేచ్ఛ స్వాతంత్రానికి పూనుకొని దాస్యశృంఖ లాలను తెంపుకొని తిరగబడ్డ రోజు అది. సెప్టెంబర్ రెండు అది పరకాల పోరుగడ్డ నుదటన నెత్తుటి మరక. జాతీయ జెండాను చేతబూని కదిలివచ్చిన వీరులు.

- గులాంగిరికి వ్యతిరేకంగా తిరగబడ్డ వీరులు
- ఆ యోధులు ప్రతి ఎదలో సజీవులు
- వారి స్మారక మందిరం అమరధామం

# గర్జించిన వరుణుడు... వరదలో ఓరుగల్లు

### మొదటి పేజీ తరువాయి

నగరంలోని అంబేద్కర్ సెంటర్ వడ్డెపల్లి, గాంధీనగర్, భవానీనగర్, అశోకకాలనీ, వాజ్‌పయ్‌కాలనీ, నయింనగర్, పోచమ్మకుంట వికాస్‌నగర్, జులైవాడ, ప్రకాష్‌రెడ్డిపేట, గాయత్రికాలనీ, వాసవికాలనీ, కృష్ణకాలనీ, దేశాయిపేట, సంతోషిమాతకాలనీ, శివనగర్, కరీమాబాద్, కాపువాడ, సుధనగర్, కేయూ రోడ్డు సమీపాన గల కాజీపేట జంక్షన్ బస్టాండ్‌తో సహా అన్ని కాలనీలు, జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలగింది. వరంగల్ – జనగామా– హైదరాబాద్ ప్రధాన రహదారుల్లో నీరు వరదలా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 3గంటల నుండి వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నాలాలు ఉప్పొంగడం, వర్షపు నీటితో పాటు డ్రైనేజీలు, ఉప్పొంగి నదులను తలపిస్తుండటంతో ఓరుగల్లు నగరమంతా నరకంలా తలపిస్తుంది. ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షాలకు నదులను తలపిస్తుండగా నర్సంపేట, పరకాల, మహబూబాబాద్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, పాలకుర్తి, తొర్రూరు పలు ప్రాంతాలలో అత్యధిక వర్షాపాతం నమోదుకాగా ఆయా డివిజన్‌లలోని గ్రామాలలోని చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు వరదలో చిక్కుకొని గల్లంతై మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కటాక్షపురం చెరువు మత్తడి పోస్తుండటంతో ములుగు ప్రధాన రహదారి రాకపోకలు బంద్ అయ్యాయి. వేల ఎకరాల్లో మొక్కజొన్న పత్తి, మిర్చి వరి సాగు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడటంతో శనివారం రాత్రి ఆదివారం రోజంతా విద్యుత్ లేక అనేక గ్రామాలు అందకారంలోనే ఉన్నాయి. స్థంబాలు విరిగిపడటంతో విద్యుత్ అధికారులు విద్యుత్ మరమ్మత్తులు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నగరంలోని వరద ముంపు ప్రాంతాలను అధికారులను అప్రమత్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు గ్రామాలను, నిండుకుండలో తెగిపోయే దశలో ఉన్న చెరువులను పరిశీలించి సమీక్షిస్తున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగంతో పాటు రిస్క్యటీమ్‌లను, ఎన్‌జిఆర్ బృందాలను అధికారులు సిద్దంగా ఉంచారు. వరుణ గర్జనతో ఉమ్మడి జిల్లా అంతా జలమయమైంది. ఎన్నడు లేని విధంగా కుండపోత వర్షం కురియడంతో ఓరుగల్లు నగరమంతా ఎటు చూసినా నీటితో నదులను తలపిస్తున్నట్లు నగర వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు గతంలో కూడా ఓరుగల్లు మునగడం తెలిసిందే. కాగా నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని పదే పదే అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికి ఆచరణలో మాత్రం కానరావడం లేదని గతంలో మాదిరిగానే ఈ ఏడు ఓరుగల్లు నీటమునిగిందని, కబ్జాకు గురైన నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని నగరంలో అండర్ డ్రైనేజి సిస్టమ్ ఏర్పాటు చేయాలని వరద ముంపు ప్రాంతాలను గుర్తించి కాలనీలలో నీరు రాకుండా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని ఓరుగల్లు నగర వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.





# వరద ముంపులో ఆర్టీసి బస్సు

**నెక్కొండ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త**

వరద ముంపులో ఆర్టీసి బస్సు చిక్కుకోవడంతో డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన నెక్కొండ మండలంలో ఆదివారం ఉదయం నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వెంకటాపురం, తోపనపల్లి గ్రామాల మధ్యలో ఉన్న లోలెవల్ వంతెనపై నుండి వరద ప్రవాహం పొంగి ప్రవహించింది. ఈ క్రమంలో ఈ మార్గంలో వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు వెళుతున్న మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు వరదలో చిక్కుకున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో వరంగల్ నుండి నెక్కొండ మీదుగా మహబూబాబాద్‌కు వెళుతున్న బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. లోలెవల్ వంతెన వద్ద వరద ప్రవాహం పెరగడంతో డ్రైవర్ శ్రీనివాస్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో రెండు కల్వార్టుల మధ్య బస్సు ఇరుక్కుపోయిందన్నారు. అర్ధరాత్రి కావడంతో ప్రయాణికులు ఎటువెళ్లాలో తెలియక ఉదయం 6గంటల వరకు ప్రయాణికులంతా బస్సులో ఉండిపోయారు. అందిన సమాచారం మేరకు సిఐ చంద్రమోహన్, ఎస్ఐ మహేందర్‌లు ఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు.

### తరలివచ్చిన ఎమ్మెల్యే కలెక్టర్ సీపీ...

బసుస వరదల్లో చిక్కుకున్న విషయం తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, సీపీ అంబర్‌కిషోర్‌ఝాలు ఘటన స్థలానికి చేరుకొని సమీక్షించారు. ప్రయాణికులను తరలించడానికి వీలు కాకపోవడంతో సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీతో బస్సును బయటకు తీయడానికి ప్రయత్నించారు. అయినా వీలు కాకపోవడంతో ప్రయాణికులంతా లారీపైకి ఎక్కి సురక్షితంగా వెంకటాపురం గ్రామానికి చేరుకున్నారు. ప్రయాణికులందరికి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. అలాగే ఎమ్మెల్యే దగ్గరుండి మరోబస్సులో మండల కేంద్రానికి ప్రయాణికులను తరలించారు. అనంతరం మిగతా ప్రయాణికులందరికి భోజన వసతి కల్పించి వారి గమ్యస్థానాలకు తరలించారు. కాగా రాత్రి నుండి ఉదయం వరకు తాము ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటు గడిపామని ప్రయాణికులు వాపోయారు. రాత్రి కావడం, జోరువానతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థిథి నెలకొందన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో తాము ప్రాణాలతో బయటపడ్డామన్నారు. అలాగే పోలీసు యంత్రాంగం అధికారులు సైతం తమకు అండగా నిలిచారన్నారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించిన ఆర్టీసి బస్సు డ్రైవర్‌ను అధికారులతో పాటు స్థానికులు అభినందించారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో జలదిగ్బంధంలోనే ఉండిపోయారు. కాగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించారు.

# దంచికొట్టిన వాన...

### మొదటి పేజీ తరువాయి

వాజేడులో 83.3మిల్లిమీటర్లు, గోవిందరావుపేటలో 80.8మిల్లి మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు స్వీయ రక్షణ పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాలలో ఉండే ప్రజలు వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి సీతక్క తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐటిడిఏ ఏటూరునాగారంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఐటిడిఏ ఏటూరునాగారంలో కంట్రోల్‌రూమ్ సెల్ నెం.6309842395,08717-293246 లేదా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 18004257109ను సంప్రదించండి. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులన మంత్రి సీతక్క ఆదేశించారు. మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఎస్పీ శబరీష్‌లతో కలిసి గోవిందరావుపేట మండలంలోని గుండ్లవాగు, జంపన్నవాగు వరద ప్రవాహాన్ని, తాడ్వాయి మండలంలోని మొండ్యాల తోగు, జలగలంచవాగు, మేడారం జంపన్న వాగు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో 26 సెంటిమీటర్లకు పైగా వర్షపాతం నమోదయిందని ముఖ్యంగా మేడారం తాడ్వాయి రహదారిపై గాలివాన బీభత్సానికి సుమారు 200చెట్లు ధ్వంసం అయ్యాయని మరికొన్ని చెట్లు రహదారికి అడ్డంగా పడిపోవడంతో రవాణాకు అంతరాయం ఏర్పడిందని వెంటనే జిల్లా కలెక్టర్ ఎస్పీ ఆధ్వర్యంలో చెట్లను తొలగించి రవాణాను పునరుద్దరించడం జరిగిందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం వరదల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశ్యంతోనే రెండు నెలల ముందే జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆద్వర్యంలో ముందస్తుగా అధికారులను అప్రమత్తం చేసి, ప్రతి మండలానికి ఫ్లడ్ మానిటరింగ్ కమిటి ఏర్పాటు చేసి స్థానిక తహాశీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎంపిడివో, ఇతర అధికారులతో ఐదుగు అధికారులతో కమిటి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉందని ముందస్తు ప్రణాళికల ద్వారా జిల్లా యంత్రాంగం అలర్ట్‌గా ఉందని ప్రజలందరూ స్వీయ రక్షణ పాటించాలని కూలిపోయే ప్రమాదంలో ఉన్న గృహాల నుంచి ప్రజలు అధికారులకు సహకరిస్తూ ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని, వాగు ప్రవహాలను తక్కువ అంచనావేసి ఎవరూ కూడా దాటే ప్రయత్నం చేయకూడదని వాగుల వద్ద ఉండే అధికారులక సహకరించాలని కోరారు. జిల్లాలో నార్లాపూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పిడుగుపడడం ద్వారా,కాలవపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పశువుల కోసం వెళ్లి బురదగుంటలో చిక్కుకొని మృత్యువాత పడ్డారని వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ప్రకృతి విపత్తు సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవతాదృక్పదంతో సహాయక సహకారాలు అందిస్తూ స్థానిక యువత రాజకీయ నాయకులు ప్రజా ప్రతినిధులు, ప్రజల ప్రాణాలు కాపాడడంలో అండగా నిలవాలని కోరారు. అలాగే ప్రజలందరూ అత్యవసర పరిస్థితి ఉంటేనే మాత్రమే బయటికి రావాలి అని, అలాగే విద్యుత్ స్థంబాలకు, విద్యుత్ తీగలకు దూరం పాటించాలని కోరారు.





# మరుపురాని నెత్తుటి మరక

### మొదటి పేజీ తరువాయి

పరకాల పాత తాలుకు ప్రాంతంలో వివిధ గ్రామాల నుంచి యోధులు స్థానిక అమరవీరుల మైదానం (ప్రస్తుతం) దాక కదనోత్సహంతో వచ్చారు. అప్పటి తహసీల్దార్ ఆదేశాలతో వారిపై కాల్పులు జరుపగా 22 మంది అక్కడికక్కడే వీరమరణం పొందారు. మరో 150 దాకా గాయాల పాలయ్యారు. అమృత్‌సర్‌లో జరిగిన మరో జలితున్ వాల్‌చాడ్ దూరంతాన్ని పరకాలలో మరుపురాని మరకగా నిలిచింది. తెలంగాణలో నిజాం నిరంకుశ పరిపాలనకు నిదర్శనంగా పరకాలలో నాడు జరిగిన దారుణ మారణకాండ నిలుస్తుంది. భూమి కోసం, భుక్తి కోసం, బానిస బ్రతుకుల నుండి విముక్తి కోసం నిజాం రాజులపై పోరాటం సాగించి రజాకార్ల దాడుల్లో అమరులైన వీరుల రక్తచరిత్రకు నేటికి సరిగ్గా 75 ఏళ్లు, జలియన్ వాలాబాగ్ ఘటనను తలపించేలా పరకాలలో జరిగిన మారణ హోమం, పోరుగడ్డ మీద పరకాల వీరులు చిందించిన నెత్తుటి జ్ఞాపకమే పరకాలలోని అమరధామం. తెలంగాణ సాయుధ పోరాటంలో నాటి నెత్తుటి చరిత్రపై ప్రత్యేక కథనం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరు ప్రపంచమంతా స్వాతతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకుంటూ ఉంటే, తెలంగాణ రాష్ట్రం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న సమయమది. బానిస బతుకులతో తెలంగాణ ప్రజల రక్తం ఉడికిపోయింది. తెలంఆణ గ్రామాలలో రజాకార్ల దాష్టీకాలకు అంతులేకుండా పోయింది. దీంతో తెలంగాణ సాయుధ పోరాటం రజాకార్లకు వ్యతిరేకంగా తెరమీదకు వచ్చింది. ఉద్యమ నేతల పిలుపు మేరకు సెప్టెంబర్ 2వ తేదిన పరకాల తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని నిర్ణయించుకున్న ఉద్యమ నేతలు, ప్రతి గ్రామం నుండి ప్రజలకు పెద్ద ఎత్తున తరళిరావాలని పిలుపునిచ్చారు. పోలీసలు వరంగల్ జిల్లాలో అన్ని సమావేశాలను నిషేధించారు. కాని సమీప గ్రామాల నుండి 1500 మందికి పైగా ప్రజలు భారత జెండాను ఎగురవేయడానికి వచ్చారు. జలియన్ వాలాబాగ్ తరహాలో మారణకాండ సాగించిన రజాకార్లు పరకాల సమీపంలోని గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు పరకాలలోని చాపలబండ వద్దకు చేరుకునే సరికి, అక్కడికి వచ్చిన రజాకార్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. కత్తులు, బరిసెలతో ఉద్యమకారులను వెంబడించి ప్రాణాలు తీశారు నాడు జరిగిన దారుణ మారణ కాండ జలియన్ వాలాబాగ్ ఉదంతాన్ని తలపించేలా జరిగిందని నాటి దృశ్యాలను చూసిన చాలా మంది పెద్దలు ఆనాటి దృశ్యాలను చెప్తుంటే కళ్లు చెబురుస్తాయి.

### చెట్టుకు కట్టేసి ఊచకోత...

నెలకొరిగిన ఉద్యమకారులు నాటి మారణకాండలో రజాకార్ల కాల్పుల్లో అక్కడికక్కడే 22 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘనలో 150 మంది గాయాల పాలయ్యారు. కొందరు ఉద్యమకారులను చెట్టుకు కొట్టి మరీ ఉచకోత కోశారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. ఇళ్లను తగటబెట్టారు. అత్యంత పాశవికంగా రజాకార్లు చేసిన ఈ దురాగతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నాడు తెలంగాణ సాయుద పోరాటంలో వీరోచితంగా పోరాడిన ఉద్యమకారులు వడ్డేపల్లి వీరయ్య ఆకుతోట మల్లయ్య, రాజ్‌మహ్మద్‌లను రంగాపురంలో చెట్టుకు కట్టేసి ఊచకోత కోసం కాల్చి చంపిన ఘటన నేటికి చాలా మంది మర్చిపోలేదు.

### సజీవంగా మట్టుపెట్టిన కిరాతకులు....

స్వాతంత్ర్యం కోసం ఉద్యమిస్తున్న తరుణంలో భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం, పరకాల మండలం లక్ష్మీపురం గ్రామాల నడిఒడ్డున రెచ్చిపోయిన రజాకారులు ఉద్యమకారులను సజీవంగా మట్టుపెట్టారు. ఆయా గ్రామాలకు చెందిన ఆకుతోట మల్లయ్య, వడ్డెపెల్లి వీరయ్య రాజ్‌మహ్మద్‌లను గ్రామంలోని ప్రదాన కూడలి వద్ద గల చెట్టుకు కట్టివేసి విచక్షణా రహితంగా ఊచకోత కోసి తుపాకులతో కాల్చి చంపేశారు. రజాకారుల పోరాటంలో మంత్రి కేదారి, పోతుగంటి పెద్దులు, గజ్జి పర్వతాలు, ఆయుదాలపు వీరన్న, మేకల పోచయ్య, బత్తుల సమ్మయ్య, దాచెపెల్లి రాజయ్య, గుండారపు కొమురయ్య, తొనగారి పూర్ణసింగ్, జెలిగెపు మైసయ్య, అలువాల అంకూస్, గిన్నె కట్టమల్లు, కుంట ఐలయ్య, పరకాల పోరుగడ్డపై జరిపిన కాల్పుల్లో మొత్తంగా 15మంది మృతిచెందగా వేలాది మంది క్షతగాత్రులయ్యారు.

# భారీ వర్షానికి దెబ్బతిన్న రైల్వే ట్రాక్

## గాలిలో వేలాడుతున్న పట్టాలు
## సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం
## స్టేషనలో నిలిచిపోయిన రెండు రైళ్లు
## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకుల తరలింపు
## జల దిగ్బంధంలో కేసముద్రం

కేసముద్రం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త





భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా కేసముద్రం మండలంలో ఉన్న రైల్వే ట్రాక్ రెండు చోట్ల ధ్వంసమైంది. వరద ఉధృతికి ట్రాక్ కింద ఉన్న మట్టి కట్ట కొట్టుకుపోవడంతో పట్టాలు గాలిలో వేలాడుతున్నాయి. వరంగల్-కేసముద్రం మధ్య ఇంటికన్నె సమీపంలో, కేసముద్రం-మహబూబాబాద్ మధ్యలోని తాళ్లపూసపల్లి సమీపంలో రెండు చోట్ల శనివారం రాత్రి వరద ఉధృతికి రైల్వే ట్రాక్ దెబ్బతినగా ఆ సమయంలో వెళ్లాల్సిన సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రైళ్లకు సంబంధించిన ప్రయాణీకులను స్థానిక అధికారులు, పోలీసులు ఆర్టీసి బస్సులలో సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తరలించారు. నిలిచిపోయిన రైళ్లల్లో ఉన్న ప్రయాణీకులు శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానికులతో పాటు అధికారులు ప్రయాణీకులకు తమకు తోచిన విధంగా సాయమందించారు. భోజనాలు, మంచినీళ్లు అందజేసారు. కేసముద్రంకు ఇరువైపుల ఉన్న మార్గాల్లో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో ఈ మార్గాల్లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో పలు గ్రామాల్లో భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొంగి పొర్లి భీభత్సం సృష్టించాయి. రైతులు వేసుకునన పంటలు నీటి పాలయ్యాయి. మండలంలోని చాలా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందలకు గురయ్యారు. ఇదిలా ఉండగా రైల్వే పోలీసులతో పాటు మహబూబాబాద్ రూరల్ సిఐ నరసయ్య, కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజుల సహకారంతో ఎన్‌డిఎఫ్ సిబ్బంది కేసముద్రం చేరుకొని ప్రయాణీకులను అక్కడి నుండి బస్సుల్లో కాజీపేట స్టేషన్‌కు తరలించారు.

# బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి

ఎడ్యుకేషన్ కేయూ, సప్టెంబరు 1 ప్రభాతవార్త :

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలని ఎంజీఎంలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న బీసీ నాయకులు చాపర్తి కుమారస్వామి గాడ్గేని ఎంజీఎం ఆస్పత్రిలో బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డా.తిరునాహరి శేషు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కులగనన చేస్తామని ప్రతీ బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 20వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలను అమలుచేయాలని బీసీ నాయకులు చాపర్తి కుమారస్వామి గాడ్గే గత ఎనిమిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల కులసంఘాలు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉండాలని



డిమాండ్‌చేస్తున్నారని, కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చిన మేరకు బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ జిల్లా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ఎంజీఎంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కుమారస్వామి దీక్షను విరమింపచేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, దామెరకొండ కొమురయ్య, మాదాసి సురేష్, రైతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులుగా మౌటం కుమారస్వామి

ఎడ్యుకేషన్ కేయూ, సప్టెంబరు 1 ప్రభాతవార్త :

హన్మకొండ జిల్లా కమలాపూర్ గ్రామానికిచెందిన మౌటం కుమారస్వామి జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.రావుల జగదీశ్వర్ ప్రసాద్ నియామక ఉత్తర్వులు అందచేశారు. ఈసందర్భంగా డాక్టర్ మౌటం కుమారస్వామి మాట్లాడుతూ తనపై నమనమకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేవ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.రావుల జగదీశ్వర్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ముదిరాజ్ జాతి శ్రేయస్సుకు పాటుపడుతానని, బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చే ఉద్యమంలో పాల్గొంటానని తెలిపారు.



# పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గార్ల, సెప్టెంబర్1 ప్రభాతవార్త:



ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిటశాపంగా మారిన కొత్తపెన్షవిదానాన్ని రదుద్ధుపసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ టిజిజెఎల్ఎ-475 జిల్లా అధ్యక్షులు వేముల రవీందర్ డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆదివారం జిల్లా కోర్టు సెంటర్‌లో సంఘం జిల్లా నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతు సిపిఎస్ విధానంతో పదవీవిరమణ తదుపరి కనీసపెన్షన్ అందకుండా సామాజిక, ఆర్థిక భద్రత లేకుండా చేసిందని ఆవేధనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలని, వెంటనే పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ జోగ్యానాయక్, మహిళా సెక్రటరీ సుశీల, తదితరులన్నారు.

## నేరాలు-దారుణాలు

# జనవిజ్ఞానవేదిక మండల కార్యవర్గ ఎన్నిక

గంగారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త





జనవిజ్ఞాన వేదిక గంగారం మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా బి భద్రులాల్, ప్రధాన కార్యదర్శిగా ముడిగ రమేష్, కోషాధికారిగా ఈసం సారంగపాణి, చెకుముకి కన్వీనర్‌గా బత్తుల శ్రీనివాస్, యస్ యాకలక్ష్మి, సమత కన్వీనర్‌గా వి చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ప్రకటించారు. గంగారం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తగూడ మండల జెవివి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పులుసం సాంబయ్య, దూపటి సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమాజంలోని మూఢాచారాలను రూపుమాపి, విద్యార్థులో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడానికి జెవివిలు కృషి చేస్తున్నాయని, ప్రతి ఒక్కరు జెవివిలో సభ్యులుగా చేరాలని వారు కోరారు.

# నేడు యూనివర్శిటీ కళాశాలలకు సెలవు

ఎడ్యుకేషన్ కేయూ, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :

భారీ వర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకొని వైస్‌ఛాన్సలర్ ఇన్‌చార్జి కరుణ వాకాటి ఆదేశాల మేరకు ముందుజాగ్రత్తగా కేయూపరిధిలో ఈనెల 2వ తేదీన (సోమవారం) విశ్వవిద్యాలయ పరిధి అన్ని యూనివర్శిటీ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. అదేవిధంగా జరగవలసిన అన్ని డిగ్రీ, పీజీ పరీక్షలను (థియరీ, ప్రాక్టికల్, అంతర్గత పరీక్షలు) వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.తిరిగి ఈ పరీక్ష ఎప్పుడు నిర్వహించేది పరీక్షల నియంత్రణ అధికారి ద్వారా తెలియచేస్తామని, మిగిలిన పరీక్షలు యధావిధగా టైంటేబుల్ క్రారం జరుగుతాయని తెలిపారు.

# వాసవి వారోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరం

ఎడ్యుకేషన్ కేయూ, సప్టెంబరు 1 ప్రభాతవార్త :

వాసవి వారోత్సవాల్లో భాగంగా డిస్ట్రిక్ట్ 5 101 ఎ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 2వ కాబినెట్ సమావేశంలో వరంగల్ మహాత్మాగాంధీ ఆస్పత్రి వారితో కలిసి నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని వాసవి క్లబ్ వరంగల్ ప్రాథమిక సభ్యులుగా డా.వల్లాల పృథ్వీరాజు, ఐపీసీ, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ నవనిర్మాణ్‌కోచ్. కాకతీయ విశ్వవిద్యాలయ ప్రజాసంభందాల అధికారి రక్తదానం చేశారు. ఈసందర్బంగా ముఖ్య అతిథిగా హాజరైన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్ వాసవియన్ గోల్డెన్ కెసిజీఎఫ్ ఇరుకుళ్ల రామక్రిష్ణ గవర్నర్ గంపా సాంబమూరినత, దొడ్డ మోహన్‌రావు, వేమిశెట్టి కిషోర్, పల్లెర్ల వీరన్న, క్లబ్ సభ్యులు అభినందించారు.



# పలు గ్రామాల్లో తెగిన చెరువులు,కుంటలు

### ముంపుకు గురైన రావిరాల గ్రామం

### నెల్లికుదురు మండలంలో 469.6 మి.మిగా

### జిల్లాలో గిరిష్ట వర్షాపాతం నమోదు

*నెల్లికుదురు,సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

మండలంలోని కురిసిన బారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల చెరువులు,కుంటలలతోపాటు మండలంలోని వివిధ గ్రామాల శివారు నుండి ప్రవహించే ఆకేరువాగు ఉగ్రరూపం దాల్చడంతో ఆకేరువాగు నీరు శివారు గ్రామాల పరిసరాల్లోకి రావడంతో రైతులు వేసుకున్న పంటలు నీట మునిగి ఆవేదన చెందుతున్నారు.మండలంలోని రావిరాల గ్రామ చెర్వు నిండి నీటి వరుదతో గ్రామంలోకి చెరడంతో గ్రామంలోని పలుఇండ్లు చుట్టు నీరు చేరి,ఇండ్లలోకి ప్రవేశించడంతో అయా ఇండ్లలోని ప్రజలు ఇండ్ల డాబాల పైకి ఎక్కి తలదాల్చుకుని కాపాడండి అని వేడుకోవాల్సి న ప్రమాధకర పరిస్దితి నెలకొంది,నెల్లికుదురు,మధనతూర్తితోపాటు పలు గ్రామాల్లోని ఇండ్లు కూలి నేలమట్టమయ్యాయి,మండల కేంద్రంనుండి జిల్లా కేంద్రంనకు వెళ్ళు రహదారిపై ఆలేరు,రావిరాల లోలేవల్ రొడ్డాములపైకి నీరు వచ్చి ఉదృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు బందు అయ్యాయి.నెల్లికుదురు నుండి మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి,నర్సింహులపేట మండలానికి వెళ్ళుదారిలో ఆకేరువాగుపై బ్రిడ్జి ఉన్నప్పటికి నీటి ఉదృతి దాదాపు బ్రిజ్జికి అటుఇటు అరకిలోమీటర్ మేరకు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.కాగ నెల్లికుదురు మండల కేంద్రంలోని ముత్యాలమ్మ బజారులో నీటి ప్రవాహానికి ఆకుల రామయ్య ఇండ్లలోకి నీరు చేరడంతో ఇంటిలో మంచాలపైకి ఎక్కి తలదాల్చుకోవడంతోపాటు నిత్యవసర వస్తువులతోపాటు పలు సామాగ్రి నీటిమునిగిన పరిస్దితి నెలకొంది,గాలి దూమారానికి లక్కాకుల సూరయ్య ఇంటిపై చెట్టుకూలడంతో ఇంటిలో నిద్రిస్తున్నావారికి తృటిలో పెను ప్రమాదం తప్పింది.నెల్లికుదురు మల్లెసముద్రం చెర్వు,రావిరాల చెర్వు,పార్వతమ్మగూడెంనకు చెందిన బందం చెర్వుతోపాటు మరోరెండు కుంటచెరువులతోపాటు పలు చెరువలు తెగిన సంఘటనలనెలకొన్నాయి.ఏది ఏమైనా మండల అధికారులు తహాశీల్దార్ కోడిచింతల రాజు,ఎస్సై చిర్ర రమేష్ బాబు,ఎంపిడిఓ బాలారాజ్‌లు ఎప్పడికప్పుడు నీటి ఉదృతిని పరిశీలిస్తు నీరు ప్రవహిస్తున్న రోడ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్న విధానాన్ని మండల ప్రజలు

### అభినందిస్తున్నారు.నర్సింహులపేటలో

నర్సింహులపేట ః మండలంలోని గ్రామాల్లో శనివారం నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని కౌంసల్యదేవిపల్లి శివారు ఆకేరువాగు ప్రాంతం నీటితో నిండిపోయి అతలాకుతలమైంది.కాగ వరధ ప్రభావానికి మండల కేంద్రంలోని బంధం చెర్వు,రామన్నగూడెం వెంకమ్మ చెర్వు,జయపురం,పెద్దనాగారం చెరువులు.పడమటిగూడెంలోని కుమ్మోనికుంట చెరువులకు గండ్లు పడ్డాయి.ఆకాల వర్షానికి రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగ వరద ప్రాంతాలను స్దానిక తహాశీల్దార్ నాగరాజు,ఎస్సై సురేష్‌లు ఎప్పడికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారుఇనుగుర్తిలో...ఇనుగుర్తి ః మండలంలో కురిసిన వర్షం రికార్డు స్దాయిలో నమోదైంది.మండల కేంద్రంలో బేడిచెరువు,గుంటి చెర్వులతోపాటు పలు చెర్వులు మత్తడ్లు పోస్తున్నాయి,మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టు నీరచేరడంతో అందకారం నెలకొంది.మండలంలోని చిన్ననాగారం ఎర్రకుంట చెర్వుకు గండిపడి వరధనీరు గ్రామానికిచెందిన కొత్తపల్లి శశిరేఖ,వరిపెల్లి నర్సమ్మ,పంజాల రమేష్,లచ్చుమ్మ ఇండ్లలోకి నీరు చేరాయి,ఊర చెర్వు మత్తడితో నెల్లికుదురు,కేసముద్రంనకు రాకపోకలు నిలిచిపోయాయి.మురికినీరు ఇండ్లలోకి చేరడంతో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారు.కాగ అధికారులు డిటి ఆకుల రవి,నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు,కేసముద్రం ఎస్సై మురళిధర్‌లు ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్లలోనుండి బైయటకు రావద్దని హెచ్చరికలు జారీచేశారుచిన్నగూడురులో..చిన్నగూడురు ః గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రంతో పాటు మండలంలోని అనేక గ్రామాలలో భారీ నష్టం వాటిల్లింది. చిన్నగూడూరు మండలకేంద్రంలోని ఆకేరువాగు వరద ప్రవాహానికి కోట్టుకపోయింది. దీంతో ఉగ్గంపల్లి సహా మిగతా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా మండలకేంద్రం నుండి గుండంరాజుపల్లి, పగిడిపల్లికి వెళ్లే మార్గంలో జిన్నెలవాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చౌటకుంట, జయ్యారం గ్రామంలోని పెద్దచెరువు, రామ సముద్రం, గుండంరాజుపల్లి గ్రామంలోని రెండు చెరువులు, తుమ్మల బండ, గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మల చెరువులకు గండ్లు పడ్డాయి. దీంతో వందలాది ఎకరాల సాగుభూమి కోట్టుకపోయింది. ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి వెంకన్నకు చెందిన 12గొర్రెలు ఆకేరువాగులో కొట్టుకపోయాయి. ఆకేరు ఎన్నడూ లేనివిధంగా ఉగ్రరూపంతో ప్రవహించడంతో చుట్టప్రక్కల పంటపొలాలు కొట్టుకపోవడంతో పాటు బావుల వద్ద ఉన్న వందలాది మోటార్లు నీటిలో కొట్టుకపోయాయి. దీంతో రైతన్నలు దుఖసాగరంలో మునిగిపోయారు. మహిళలు గంగమ్మ ఉగ్రరూపాన్ని శాంతింపచేయాలని కొబ్బరికాయలు కొట్టి పసుపుకుంకుమలు చల్లారు. ఎలా మొదలైందో.. ఆకేరు లయ తప్పింది. ఉగ్రరూపం దాల్చి గంగమ్మను వల్లో చేర్చుకొని పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది.



# ఒక వైపు వీడియో కాన్ఫిడెన్స్‌లు - మరోవైపు బాధితులకు అండగా

### ఉదయం నుండి సాయంత్రం వరకు లోతట్టు ప్రాంతాల్లో

### కలెక్టర్ సుడిగాలి పర్యటన

### వరంగల్ కలెక్టర్ పనితీరు బేషు అంటున్న వరంగల్ వాసులు

*వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త:*

ఒక వైపు వీడియో కాన్ఫరెన్స్‌లు మరో వైపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చే ప్రయత్నాలు ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు అధికారులు వెంట తీసుకొని సుడిగాలి పర్యటన చేస్తున్న వరంగల్ కలెక్టర్ పనితీరు నగర వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో జలమయమయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఖాళీ చేయించి సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. జిల్లాలోని అన్ని చెరువులు పొంగి పోర్లుతున్నాయని తహశీల్దారులు, ఇరిగేషన్ అధికారులు, ఎంపిడివోలతో బృందాలు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడే పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3434, మొబైల్ నెం.9154252936కు జిడబ్ల్యూఎంసిలో టోల్ ఫ్రీ నెంబర్



18004251980,9701999645,9701999676 మొబైల్ నెంబర్లు ఏర్పాటుచేసి 24గంటలు పర్యవేక్షిస్తూ ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక రెస్క్యూ బృందాలచే సహాయక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవిన్యూ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైద్రాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్లతో అతి భారీ వర్షాలు దృష్ట్యా, తీసుకుంటున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవిన్యూ,



సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే 48గంటల పాటు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపినందున అధికారులంతా అప్రమత్తతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పంచాయితీ రాజ్ అధికారులు గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి నిర్వాసితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. చెరువులు, వివిధ ప్రాజెక్టులు కాల్వలు నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా అధికారులు, తహశీల్దార్,ఎంపిడివో, ఎంపివోలు భారీ వర్షాల నేపథ్యంలో హెడ్ క్వార్టర్‌లో ఉండి సమన్వయంతో పనులు చేయాలని,జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని, ప్రజలు అత్యవసర పరిస్దితుల్లో ఫోన్‌నెంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.గ్రామాల్లోని లోతట్లు వంతెనల వద్ద నీటి ప్రవాహం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి ప్రవాహం అధికమైనట్లయితే దారులను మూసివేసి బారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ పునరుద్దరణ చర్యలు వేగవంతంగా చేపట్టాలని, విద్యుత్ వైర్లు తెగిపడిపోయినట్లయితే వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రజలను తరలించేందు సమీపంలో క్యాంపులు ఏర్పాటు చేసేందుకు వీలుగా సంసిద్ధంగాఉ ండాలని ఆదేశించారు.భారీ వర్షాల నేపద్యంలో ఎలాంటి ప్రాణ ఆస్తి, జంతు నష్టంవాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిస్థితి మెరుగుపడేవరకు చెరువుల వాగుల వద్ద చేపలు పట్టడానికి, స్నానాలకు అనుమతించవద్దని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్‌ఝా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి పూసపల్లి వద్ద రైల్వే ట్రాక్ ద్వంసం

### -మానుకోటలో ఆగిన పలు రైళ్లు
### -ప్రయాణికులకు ఆహార పదార్థాలు అందించిన టౌన్ సిఐ
### -పలువురు స్వచ్ఛందంగా ప్రయాణికులకు అల్పహారం,పండ్లు అందజేత

మహబూబాబాద్,సెప్టెంబర్1,ప్రభాతవార్త



గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షానికి జిల్లాలోని తాళ్లపూసపలిసమీపంలో రైల్వే ట్రాక్ ద్వంసం అయింది. నీటి ఉద్రుతికి పట్టాలలోని కంకర కొట్టుకపోయింది. దీంతో ఇండియన్ రైల్వే హైద్రాబాద్-విజయవాడ మద్య రైళ్లను నిలిపివేశాయి. కాగా విజయవాడ నుండి హైద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో నిలిపారు.




శనివారం రాత్రి నుండి ప్రయాణికులకు నిద్రాహారాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండాలని టౌన్ సిఐ పెండ్యాల దేవెందర్ ప్రయాణికులకు ఆహార పదార్థాలు అందజేశారు. వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూశారు. అదేవిధంగా పట్టణానికి చెందిన పలువురు స్వచ్ఛందంగా వచ్చి ప్రయాణికులకు అల్పహారం, పండ్లు అందజేశారు. కాగా స్టేషన్‌లో ఆగిన రైలులో హైద్రాబాద్‌కు వెళ్తున్న ఆంద్రప్రదేశ్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్థానిక మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేను తన ఇంటికి తీసుకెళ్లి అల్పహారంఅందించారు. కాగా మానుకోట స్టేషన్‌లో నిలిచిపోయిన రైళ్లను తిరిగి విజయవాడ వైపు పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, టిడిపి పార్టీ జిల్లా నాయకులు కొండపల్లి రాంచందర్, ప్రేమ్‌చంద్‌వ్యాస్ తదితరులు ఉన్నారు.




## భారీ వర్షాలతో నీట మునిగిన ఇల్లు

### -తెగిన పలు చెరువు కట్టలు

కురవి,సెప్టెంబర్1,ప్రభాతవార్త

రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలకేంద్రంతో మండలంలోని పాలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని అయ్యగారిపెల్లి, నల్లెల, రాజోలు, బలపాల గ్రామాలతో పాటు ఆకేరువాగు శివారు ప్రాంతాల్లో ఉన్న తండాలు, గ్రామాలు జలదిగ్భంధంలో ఉన్నాయి. కురవి పెద్దచెరువు ఒక పక్క తెగడంతో నీరు భారిగా బయటకు విడుదలైంది. పలు గ్రామాలు చెరువు కట్టలు తెగడంలో ఇటు ఇల్లు, అటు పంట పొలాలు నీట మునిగాయి. కొత్తూరుసి గ్రామంలో మద్దెల వాగు, తుక్కుల వాగు, నేరడ శివారు రాయలపట్నం వద్ద వాగు ఉద్రుతంగా ప్రవహించడంతో పరిసర ప్రాంత ప్రజలు బిక్కుబిక్కు మంటూ గడుపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు చెరువు కట్టలు తెగడంతో పంటపొలాల్లో బుదర మెట వేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబందిత అధికారులు స్పందించి గ్రామాల్లో నాళాలు పరిశీలించి నీరు నిల్వ కుండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## వీరభద్రస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

కురవి,సెప్టెంబర్1,ప్రభాతవార్త

భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారిని ఆదివారం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. వారి వెంట మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫిసర్ క్రాంతికుమార్, జిల్లా కోర్టు సూపరింటెండెంట్ అమరేందర్, బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ పద్మాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సిపిఎస్‌ను రద్దు చేయాలి

### -టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మహబూబాబాద్ నెహ్రూసెంటర్,సెప్టెంబర్1,ప్రభాతవార్త

సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినంసందర్భంగా ఉద్యోగ ఉపాద్యాయ సంఘాల జేఎసి ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు తహశీల్దారు కార్యాలయం నుండి నెహ్రూ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్దరించాలన్నారు.



సిపిఎస్ ఉద్యోగుల భద్రతకు పెనుముప్పుగా మారిందన్నారు. గత 30,40 సంవత్సరాల నుండి ఉద్యోగుల సేవ చేస్తే వారికి సామాజిక భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రఫి, సంక బద్రినారాయణ, మల్లారెడ్డి, చుంచు శ్రీశైలం, నాగముని, రవీందర్, వీరునాయక్, పొక్కుల సదానందం, కళ్లెంవెంకట్‌రెడ్డి, రామోజినాయక్, రోహిత్‌కుమార్, రామలింగారెడ్డి, బిక్షపతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగరాజు, అశోక్, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, సుభద్ర, రమ్మ,సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ

నడికూడ,ప్రభాతవార్త:

నడికూడ మండలంలోని చర్లపల్లి,ముస్త్యాలపల్లి గ్రామాల్లో మృతి చెందిన శీలం నందని,చాడ రాజిరెడ్డి,బొట్ల రాజయ్య కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో మాజీ ప్రజాప్రతినిదులు,బీఆర్ఎస్,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్,సెప్టెంబర్1,ప్రభాతవార్త



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంతో పాటు పలు కాలనీలు జల దిగ్భంధంలో చిక్కుకున్నాయి. ఆదివారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వరద ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని, అత్యవసమైతేనే బయటకు రావాలని తెలిపారు. జిల్లా అధికారులను ఎప్పటికప్పుడు పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు.

## అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్,సెప్టెంబర్1,ప్రభాతవార్త

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని జమాండ్లపల్లి, పాకాలవాగు, రావిరాల, నెల్లికుదురురోడ్డు, తాళ్లపూసల్లి, ఎన్‌టిఆర్ స్టేడియం, బంధంచెరువు ఉద్రుతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇంటి వద్దనే ఉండాలని విహారయాత్రల్లాగా వెళ్లకూడదన్నారు. రానున్న రెండు,మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసేఅవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు అందుబాటులోఉండాలన్నారు. వర్షాల నేపథ్యంలో నేడు జరుగబోయే ప్రజావాణి, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. వర్షాల కారణంగా ప్రజల సౌకర్యార్థం పునరావాస కేంద్రాలు డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, కురవి మండలకేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### -హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద

మహబూబాబాద్,సెప్టెంబర్1,ప్రభాతవార్త



రక్తదానం ప్రాణదానంతో సమానం అని తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సూరేపల్లి నంద అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కోర్టు ఉద్యోగులకు నిర్వహించిన వైద్య పరీక్షలు, రక్తదాన శిభిరంలో వారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మందులను అందజేశారు. వైద్య పరీక్షలు చేసిన వారిలో పట్టణ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫిసర్ ఒబిలిశెట్టి రామకృష్ణ, ఎం.ఎల్‌హెచ్‌పి నితిన్, ఏఎన్‌ఎంలు దీన, లలిత, ఆశా మహేశ్వరి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బండి మురళిధర్‌రెడ్డి, వినీల్‌రెడ్డి, అనిల్, దివ్య, మెడికల్ ఆఫిసర్‌లు రాంరెడ్డి, అనిత, వసుమతి, నాగరాజు, షాలినిగంగాధర్, రాజ్‌కుమార్, పర్విన్, నాగమణి, మమత, నూతన్, వెంకన్న, కిరణ్, నౌసిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఓఎస్డి బోనాల కిషన్ : అందుబాటులో పోలీసులు**

**-పోలీసుల సేవలకోసం డయల్ 100కి చేయండి**

**-లోలెవల్ వంతెనలను సందర్శించిన ఓఎస్డి కిషన్**

*చిట్యాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓఎస్డి బోనాల కిషన్ పిలుపునిచ్చారు. ఈమేరకు భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు, చిట్యాల సిఐ దగ్గు మల్లేష్‌తో కలసి మండలంలోని మొరంచ వాగు శివారు నైన్‌పాక, మొరంచపల్లి గ్రామాల వద్ద ప్రవహిస్తున్న వాగుల ఉధృతిని పరిశీలించి లోలెవల్ వంతెనలను సందర్శించారు. అనంతరం స్థానిక సిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, పరిస్థితులను బట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజలకు జిల్లా పోలీసులంతా అందుబాటులో ఉండి, పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రజలకు అందుబాటులో



ఉంటారని తెలిపారు. ప్రజలు కల్వర్టులను దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలు, యువకులు ఈతకు వెళ్లరాదని, రైతులు పొలాల వద్ద విద్యుత్తు తీగలను తాకవద్దని సూచించారు. సెల్ఫీలు దిగే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున, అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని, ప్రజలు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హితవు పలికారు. ఆపత్కాల సమయంలో 100కి డయల్ చేయాలని, పోలీసుల సేవలు 24గంటలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అవసరం అయితే తప్ప బయటకి వెళ్లకూడదని సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# తొర్రూరు వార్త

## నేడు విద్యాసంస్థలకు సెలవు

**-జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్**

*ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి*

నేడు అన్ని విద్యాసంస్థలకు సెలవు పాటించినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ రాజేందర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు తప్పనిసరిగా సెలవు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

# అకాల వర్షంతో జలదిగ్భందంలో గ్రామాలు

**-ఎక్కడికక్కడ నిలిచిపోయిన రాకపోకలు**

**-బయటకు రావొద్దని అధికారుల హెచ్చరికలు**

*బయ్యారం, సెప్టెంబర్1, ప్రభాతవార్త*

గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షం బయ్యారం మండలాన్ని కుదిపేసింది. మండలంలోని పాకాల, అలుగేరు నుండి వచ్చే వరద బ్రిడ్జిలను తాకుతూ ప్రవహించాయి. పందిపంపుల వాగు, మసివాగు, కొంగరవాగుల నుండి వచ్చే వరద ఉధృతితో బయ్యారం పెద్దచెరువు సుమారు 20అడుగులకు చేరుకొని అలుగు ఉగ్రరూపం దాలుస్తూ ఇల్లందు-మహబూబాబాద్ ప్రధాన రహదారి నామాలపాడు వద్ద ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నామాలపాడు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేశారు. ఆర్టీసీ బస్సులు తిరిగి డిపోలకు వెళ్లిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలో పందిపంపుల వాగు ప్రవహిస్తుండడంతో వరద నీటి ఉధృతికి ఇసుకమేట వేసింది. కంబాలపల్లి, నారాయణపురం, రామచంద్రాపురం, మిర్యాలపేంట, లక్ష్మీపురం గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోరుబావుల కింద వేసుకున్న మొక్కజొన్న,పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని, వరదనీటిలో పంటపొలాలు



కొట్టుకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ముందస్తు హెచ్చరికలతో గార్ల-బయ్యారం సిఐ రవికుమార్, ఎస్సై తిరుపతి మండల తహశీల్దారు విజయ సిబ్బందితో కలసి స్థానిక ప్రజలకు, ఏజెన్సీ గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాగులు, వంకల పరిధిలో పలు విద్యుత్ స్థంభాలు నెలకొరిగాయి. భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా ఇండ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా ఎప్పటికప్పుడు పునరుద్ధరణ చేసేలా చూడాలని తెలిపారు.

## అతి భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**-ప్రజలు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లొద్దు**

**-తహశీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి**

*గణపురం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు మండలంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గణపురం తహశీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈసంద ర్భంగా శిథిలమైన పాత ఇండ్లలో ఉండవద్దని, చెరువులు, కాలువల వద్దకు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్లకింద ఉండరాదని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 18004251123ఫ్లడ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ గాని, గణపురం తహశీల్దార్ కార్యాలయం 9849081855నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# జలదిగ్భందంలో మానుకోట

**-సరైన నాళాలు లేకపోవడమే కారణమంటున్న ప్రజలు-జిల్లాలో అతివృష్టి ఏర్పడింది**

**-మున్నెరువాగు ఉధృతిని పరిశీలించిన కలెక్టర్**

*మహబూబాబాద్,సెప్టెంబర్1,ప్రభాతవార్త*



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలం అయింది. మేఘానికి చిల్లు పడిందా అన్నట్లుగా కుంభవృష్టి వర్షంతో ఒక్కసారిగా జిల్లా ఉలిక్కిపడింది. చుట్టుప్రక్క గ్రామాలతో సంబంధాలు లేకుండా జలదిగ్బధంలో పడింది. అకాల వర్షం చేసిన విలయతాండవంతో తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోని పలు గ్రామాల చెరువులు, కుంటలకు గండ్లు పడడంతోపాటు, మిర్చి, పంటపొలాలు నెలమట్టం అయ్యాయి. గత యాభైఏండ్లలో ఇలాంటి వర్షం చూడలేదని, అకాల వర్షంతో వరదలు పారి అతివృష్టి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అంతేగాకుండా జిల్లాకేంద్రంలోని అండర్ బ్రిడ్జిలోకి పూర్తిగా నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికంగా ఉన్న బంధం చెరువు నీరు రోడ్డుపైకి ప్రవహించడంతో పాటు చెరువు చివరన గండి పడడంతో ఇల్లందు బైపాస్ రోడ్డుపైకి నీరు చేరి స్థానిక



ధరణి ఆసుపత్రిని చుట్టుముట్టింది. దీంతో ఇల్లందు- మహబూబాబాద్‌కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరైన నాళాలు లేకపోవడం వల్లనే బంధం చెరువు చుట్టుప్రక్కల ఉన్న ఇల్లు నీట మునిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలు ఇళ్లపైకి ఎక్కి ఉండడంతో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు జేసిబి సహాయంతో వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న మున్నేరువాగు ఉధృతంగా ప్రవహించడంతో మహబూబాబాద్ - నర్సంపేటకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈదులపూసపల్లి వైపు ఉన్న రాళ్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల నుండి కుండపోతగా కురుస్తున్న వర్షంతో మున్సిపాలిటి కేంద్రంలోని పలు కాలనీలతో పాటు మండలంలోని పలు గ్రామాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. అంతేగాకుండా భారీ వర్షంతో జిల్లాలోని తాళ్లపూసపల్లి సమీపంలో రైల్వే ట్రాక్ పూర్తిగా ధ్వంసం కావడంతో రైళ్ల రద్దు అయ్యాయి. మున్సిపల్ పరిధిలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. దీంతో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించిన అధికార యంత్రాంగానికి అభినందనలు తెలిపారు.

## ఓసీ-3లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి..

**-భారీ వర్షానికి ఓసీ-3లో భారీగా చేరిన వర్షపు నీరు**



*గణపురం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

మండలంలోని బస్వరాజుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్ట్-3 ప్రాజెక్టులో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు ఓపెన్ కాస్ట్‌లోని వరద నీరు చేరడంతో ఓబి, బొగ్గు ఉత్పత్తి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఓసీ-3ప్రాజెక్టులో ప్రతిరోజు 2500మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉత్పత్తి నిలిచిపోవడంతో సింగరేణికి కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఓసీలోకి భారీగా వర్షం నీరు చేరడంతో మోటార్ల సహాయంతో నీటిని బయటకి తీసే పనిలో అధికారులు కార్మికులు నిమగ్నం అయ్యారు.

# నలువైపుల వాగుల వరదనీటితో జలదిగ్బందంలో గార్ల ప్రజలు

## నలువైపుల వాగుల వరదనీటితో జలదిగ్బందంలో గార్ల ప్రజలు

## -నలువైపులా రహదారులపై వరదనీరు ప్రవహించడంతో నిలిచిన రాకపోకలు

## -ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జీనత్‌కుమార్ హెచ్చరిక

*గార్ల, సెప్టెంబర్1 (ప్రభాతవార్త):*





బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారివర్షాలకు పైభాగాల నుండి వరదనీరు చేరడంతో చెక్‌డ్యాం మీదుగా పొంగి ప్రవహిస్తు, చెరువులు, కుంటలు నిండి వరదనీరు నాలుగువైపులా రహదారులపై ప్రవహిస్తుండటంతో గార్లకు చుట్టుప్రక్కల గ్రామాలు, పట్టణాల నుండి రాకపోకలు నిలిచిపోవడంతో జలదిగ్బందంలో నిలిచిపోయింది. గార్ల రాంపురం గ్రామసమీపాన ఉన్న చెక్‌డ్యాం మీదుగా పాఖాల ఏటి వరదనీరు, గార్ల చెరువు మత్తడి పోస్తుండటంతో అతిభారిగా వరదనీరు పాఖాలేటి వరదనీరు సత్యనారాయణపురం వెళ్ళే రహదారిపై ప్రవహిస్తుండటంతో రాంపురం, మద్దివంచ పంచాయితీల గ్రామాల ప్రజలకు గార్లకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడమే కాక గార్ల నుండి సత్యనారాయణపురం, బయ్యారం, మహబూబాబాద్, ఇల్లందు పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గార్ల గోపాలపురం గ్రామసమీపంలో గంగమ్మ గుడివద్ద వాగుపొంగి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో గోపాలపురం, పినిరెడ్డిగూడెం, పోచారం మీదుగా ఖమ్మం పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దచెరువు నుండి వరదనీరు అప్పసముద్రం చేరడం మత్తడిపోస్తు వరదనీరు బంధం వాగు వరదనీటితో పొంగి గార్ల నుండి డోర్నకల్ వెళ్ళే రహదారిపై ప్రవహిస్తుండటంతో గార్ల నుండి డోర్నకల్, ఖమ్మం పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గార్లకు ఇతర పట్టణాలకు, గ్రామాలకు, ఇతర పట్టణాల నుండి గార్ల బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు.

**మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై జీనత్‌కుమార్**

నలువైపులా వరదనీరు రహదారులపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేయడం జరిగిందని మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎన్. జీనత్‌కుమార్ అన్నారు. చెక్‌డ్యాం మీదుగా పాఖాల ఏటి వరదనీరు భారిగా పొంగి ప్రవహిస్తు రహదారిపైకి భారిగా వరదనీరు అడ్డుగా చేరడంతో రాకపోకలు చేయకుండా భారిగేడ్స్ ఏర్పాటు చేసి పోలీస్‌సిబ్బందిని నియమించి పర్యవేక్షించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారిగా ప్రవహిస్తుండటంతో మండల ప్రజలు ఎటువంటి ప్రయాణాలు చేయరాదని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని, పిల్లలతో కలిసి సరదాగా నీటి ప్రవాహాన్ని తిలకించరాదని, పురాతన ఇంటిగోడలు కురుస్తున్న వర్షాలకు కూలడానికి సిద్ధంగా ఉంటాయి అప్రమత్తంగా ఉంటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

# ఉద్యోగానికి విరమణ సమాజ సేవకు కాదు

## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

*శాయంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

ప్రతి ఉద్యోగికి తమ ఉద్యోగానికి విరమణ ఉంటుందని, సమాజసేవకు విరమణ ఉండదని భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన కిసాన్ రైతు మండల అధ్యక్షుడు మాదిరెడ్డి ప్రంపచరెడ్డి సోదరుడు మాదిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం హనుమకొండలోని ఎంటిఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఉపాధ్యాయునిగా గత 38 సంవత్సరాలుగా మహిపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం మహిపాల్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శాయంపేట మండల అధ్యక్షుడు దుదిపాల బుచ్చిరెడ్డి, మండల నాయకులు చిందం రవి, అబ్బు ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.




# గణేష్ మండపాలు పెట్టే నిర్వాహకులకు అనుమతి తప్పనిసరి

*శాయంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

పోలీసులు సూచించిన నిబంధనలను పాటిస్తూ భక్తి శ్రద్దలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ మండపాలు పెట్టే నిర్వాహకులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌పోలీస్.గావ్.ఇన్ సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. వినాయకుడి మండపాలు ఏర్పాటు చేస్తున్న వాళ్లు శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మీరు పెట్టే గణపతి విగ్రహం సైజు తప్పనిసరిగా మాకు తెలియజేసి అనుమతి తీసుకోవాలని తెలియజేశారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలాగే 2 బాక్స్ టైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలి. రాత్రి 10గంటల నుంచి ఉ.6 వరకు వాటిని వినియోగించవద్దు. విద్యుత్ శాఖ అధికారుల పర్మిషన్ తప్పనిసరి. మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయొద్దు డీజేలకు ఎలాంటి



అనుమతి లేదు, కాబట్టి ఎవరు డీజేలు పెట్టకూడదు, రాత్రి 10 దాటిన తర్వాత మైక్లు ఎవరు డీజేలు పెట్టకూడదు, రాత్రి 10 దాటిన తర్వాత మైక్లు ఆప్ చేయాలి. ఫైర్ సేఫ్టీ కూడా తప్పక పాటించాలి. ఎలాంటి విద్యుత్ షాక్ తగలకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి. వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని మండపాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. మండపాల్లో ఏదైనా అనుమానస్పదంగా బ్యాగులు ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




## అండర్ బ్రిడ్జిలో చేరిన వరదనీటితో నిలిచిన రాకపోకలు

*గార్ల, సెప్టెంబర్1 (ప్రభాతవార్త):*



గార్ల జీవంచిపల్లి ప్రజల రాకపోకల కోసం నిర్మించిన రైల్వేఅండర్ బ్రిడ్జిలో వరదనీటితో నిండి రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారి వర్షాలకు అండర్‌బ్రిడ్జిలో వర్షపు వరదనీరు భారిగాచేరి నిలిచిపోయాయి. దీంతో నిత్యం మండల కేంద్రానికి నిత్యవసర సరుకులు, అత్యవసర, అన్ని రకాల పనుల నిమిత్తం సాగిస్తున్న రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి జలదిగ్బందంలో చిక్కుకపోయింది. వర్షం పడిందంటే చాలు వరదనీటితో మోకాళ్ళ లోతుకు నిండిపోతుందని దీంతో మండల కేంద్రానికి బాటసారులు, వాహనదారులు రాకపోకల నిలిచి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు.

## లండన్‌లో తెలుగు విద్యార్థి మృతి

*దుగ్గొండి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త*



ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థి భవిష్యత్ అనారోగ్యంతో అర్ధాంతరంగా ముగిసింది. దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన దేవుళ్లపల్లి రమేష్- రజిత దంపతుల కుమారుడు దేవుళ్లపల్లి ప్రణయ్(25) ఉన్నత చదువుల కోసం ఏడాదిన్నర క్రితం లండ్‌కు వెళ్లాడు. లండన్‌లో ప్రణయ్ 20 రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు స్నేహితుల ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందిందన్నారు. కుమారుడు మరణవార్త విన్న తల్లిదండ్రులు రజిత రమేష్ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమారుడి మృతదేహాన్ని ఇండియాకు తీసుకురావడానికి ప్రభుత్వం సహకరించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

*శాయంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



శాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదివే పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత కలుసుకొని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ వీకేకే ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించు కున్నారు. తమతో పాటు చదువుకొని అమరులైన విదా ్యర్థులకు, గురులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తమకు విద్యాబుద్దులు బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువ, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ కన్వీనర్ శాగంటి స్వామి, కో కన్వీనర్ బాసాని విద్యాసాగర్, కాళేశ్వరపు ఇందిర, కోశాధికారులు వైనాల కుమారస్వామి, చిట్టిరెడ్డి మంజుల, కోఆర్డినేటర్ కందగట్ల గణేష్, కూరాలకుల రవి, కోమటి శేఖర్, సామల సూర్యప్రకాష్, తోటి చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలతో స్తంభించిన రవాణా వ్యవస్థ



ప్రభాతవార్త- బాలసముద్రం:

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంబించి అనేక ప్రాంతాల్లో చెరువులు కాలవులు రోడులన తెగిపోవడంతో ఎక్కడి బస్సులు అక్కడే ఆగి అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఉన్న వరంగల్ 1, డిపో వరంగల్ 2 డిపో, హనుమకొండ డిపో బస్సులు వర్షాభావంతో నైట్ సర్వీసులు ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి. ఒకపక్క ప్రయాణికులు, మరోపక్క ఆర్టీసి కండక్టర్ డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడటం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం హైఎక్ట్ ప్రకటించడంతో ఆర్టీసి అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను మెరుగుపరడచానికి తీవ్ర కృషి చేస్తున్నారు. హనుమకొండ బస్టాండ్‌లో ఆర్టీసి ఉన్నతాధికారులైన రీజినల్ మేనేజర్ డీ. విజయభాను, డిప్యూటి ఆర్‌ఎం మాధవరావుల ప్రత్యేక పర్యవేక్షణలో ఆర్టీసి బృందాలతో రవాణాను పర్యవేక్షిస్తూ ప్రయాణికులను గృమస్థానాలకు చేర్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ రూట్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కువగా లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.-ఆర్టీసి రవాణాను మెరుగు పరచడానికి ప్రత్యేక ఏర్పాట్లు: మేనేజర్ డి.విజయభానుజిల్లాలో భారీ వర్షా భావంతో నిలిచిపోయిన బస్సులను పునరుద్ధరించడానికి ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఆర్టీసి రీజినల్ మేనేజర్ డి.విజయబాను అన్నారు. వరంగల్ పోలీస్ కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కేసముద్రం, రైల్వేషన్లో నిలిచిపోయిన 5000 మంది ప్రయాణికుల కొరకు ప్రత్యేకంగా 100 బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లాలో భారీ వర్షాలతో తెగిపోయిన చెరువులు, కాలువల ద్వారా రోడ్డులు దెబ్బతినడంతో స్తంబించిన రవాణా వ్యవస్థ మెరుగుపరడచం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసి వరంగల్ రీజినల్ మేనేజర్ ప్రభాతవార్తకు తెలియజేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలి




**భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలి**

**-డిప్యూటి సీఎం, మంత్రి పొంగులేటి, సీఎస్**

**-వీసీ ద్వారా కలెక్టర్, సీపీలు, ఎస్పీలతో సమీక్ష**

హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఆదివారం వారు డీజీపీ డా.జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమీషనర్‌లు, ఎస్పీలతో వరద ప్రభావిత పరిస్థితులను సమీక్షించారు. ఒక్కో జిల్లా వారిగా ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకుంఊట, చేపడుతున్న సహాయక చర్యల గురించి ఆరా తీశారు. మరో రెండు రోజుల పాటుభారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా రెస్క్యూ, బృందాలను సిద్దంగా ఉంచాలన్నారు. అధికారులు అందరు క్షేత్రస్థాయిలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, భారీ వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యటు చేపట్టాలని అవసరమైన పక్షంలో రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపిస్తామని పేర్కొన్నారు. అయితే ఎన్డీఆర్ఎఫ్ బృందాల వచ్చే వరకు వేచి చూడకుండా, పోలీసులు ఫైర్ సిబ్బంది సేవలను వినియోగిస్తూ ప్రాణనష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ నగర పాలక సంస్థ కమీషనర్ అశ్వనితానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి..

**-జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ**



ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి

రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలెర్ట్ ఉన్నదని యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ తెలిపారు. వర్షాలకు, వరదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహాశీల్దార్‌లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..గడిచిన రెండు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నామని, రానున్న రెండు రోజులు ఇదే స్ఫూర్తితో అప్రమత్తంగా ఉండాలని రెండు రోజులు చాలా ముఖ్యమని అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షం ఎప్పుడు వస్తుందో తెలీదని ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, రహదారులపై నీళ్లు వస్తే ప్రయాణాలు నియంత్రణకు ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలల్లో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్ధం చేసుకొని తగు జాగ్రత్తలు పాటించే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ చర్యల్లో ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా లూజువైర్లు గుర్తించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిండుకున్న జలాశయాలకు వీక్షణకు ప్రజలు వస్తుంటారని, నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పొంగే వాగులు, రహదారులపై వాహనాలు రాకపోకలు నియంత్రణ చేయాలన్నారు. అన్ని తహాశీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ నందు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదేని అత్యవసర సేవలకు ప్రజలు కంట్రోల్ రూము నంబర్స్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. ప్రసవానికి దగ్గర తేదీ ఉన్న మహిళలను ఆసుపత్రులను తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈటెలికాన్ఫరెన్స్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహాశీల్దార్‌లు, ఎంపిడిఓలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ముప్ప నివారణకు ఎప్పటికప్పడు చర్యలు చేపట్టండి

**-హనుమకొండ జిల్లా కలెక్టర్**

హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త:



భారీ వర్షాలు కురుస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరద ముంపు ముప్పు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య అన్నారు. ఆదివారం వరంగల్ పోతననగర్ సమీపంలోని భద్రకాళి చెరువు కట్టవద్ద వరద ఉదృతి ఎక్కువ కావడంతో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉన్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రమాదం చోటు చేసుకోకముందే చెరువు కట్ట వద్ద ఇసుక బస్తాలతో నివారణ చర్యలు చేపట్టాలని సాగునీటితో పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. వరద ముపు ఉన్న ప్రాంతాలను నిండిన చెరువులు, కుంటలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. మరిన్ని రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున వరద ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జలయమైన లోతట్టు ప్రాంతాలలో ప్రజలను సురక్షితంగా ఏర్పాట్లు చేసి పునరావాస కేంద్రాలకు తరళించాలన్నారు. వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, సాగునీటి పారుదల శాఖ డీఈ హర్షవర్ధన్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త:




సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ ఎదుట తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పెద్ద ఎత్తున ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అద్యక్షులు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాభోయే కాలంలో టీఈజేఏసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయుటలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అద్యక్షుడు అన్నామనేని జగన్‌మోహన్‌రావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ కార్యదర్శి పెండెం రాజు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అద్యక్షులు గోపాల్‌రెడ్డి, తెలంగాణ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సర్వర్, హుస్సేన్, ఎస్‌టియు అధ్యక్షులు రాంబాబు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దాస్యనాయక్, టిపిటిఎఫ్ అద్యక్షులు రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి రద్దు

హన్మకొండజిల్లా బ్యూరో- ప్రభాతవార్త:

హనుకొండ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్‌హాలులో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం (గ్రీవెన్స్ డే)ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కుస్తుండగా వివిధ శాఖల అధికారులు, సహాయక చర్యలు, విధులలో నిమగ్నమై ఉన్నందున సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ ఒక ప్రకటణలో తెలిపారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న దేవరుప్పుల వాగు





– వాగులో కొట్టుకపోయిన గొర్లు

**దేవరుప్పుల, సెప్టెంబరు। ప్రభాతవార్త :** అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దేవరుప్పుల మండలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండురోజులుగా కరుస్తున్న వర్షాలతో ప్రధానమైన దేవరుప్పుల వాగు వరద ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతోంది. రేపటివరకు కూడా ఎడతెరిపి లేకుండా వర్షం పడే అవకాశం ఉన్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల అలుగులుపోస్తున్నాయి.

**– వాగులో కొట్టుకపోయిన గొర్లు..:**

మండలంలోని కడవెండి గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద గొర్రెలను కాస్తున్న గొర్రెల కాపరులు ఒకసారిగా వాగు ఉధృతంగా పెరగడం తో ప్రమాదవశాత్తు వాగులో జారిపడ్డ గొర్రెల కాపరులు ఉప్పుల చంద్రయ్య, మహ్మద్ అంకూస్‌లను గ్రామస్తులు కాపాడారు. కాగా, 80 గొర్రెలు మధ్యలోనే ఉండిపోవడంతో వాగులో కొట్టుకపోయాయి. దీంతో గొర్రెల కాపరులు లబోదిబోమంటు ఆవేదన వ్యక్తంచేశారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సృజన్‌కుమార్, తహసీల్దార్ హుస్సేన్ చేరుకుని పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

**– సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే..:**

కడవెండి గ్రామానికిచెందిన ఉప్పుల చంద్రయ్య80 గొర్రెలు, యండి.అంకూస్‌కు చెందిన 50గొర్రెలు, పది మేకలు గొర్రెపిల్లలు మేకపిల్లలు దాదాపు 150మేకలు, గొర్రెలు దేవరుప్పుల గ్రామ మాలాగు సమీపంలోని వాగు అవతలి ఒడ్డున మేపుకొని వాగుదాటుతున్న క్రమంలో వరద ఉధృతి పెరగడంతో గొర్రెలు కొట్టుకపోయాయి. సమాచారం తెలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవిషయమై కలెక్టర్‌తో మాట్లాడి సత్వరమే న్యాయం జరిగేలా చేయాలని తెలిపారు.

# హైవేపై చేరిన వర్షపు నీరు

– జలమయమైన లోతట్టు ప్రాంతాలు

– వాహనాలకు తీవ్ర అంతరాయం





**రఘునాథపల్లి, సెప్టెంబరు । ప్రభాతవార్త :** గత రెండురోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు రఘునాథపల్లి మండలంలోని కోడూరు, గబ్బెట, కంచనపల్లి, మండేలగూడెం గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో చెరువులు నిండి మత్తళ్ల పోస్తున్నాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. కోడూరు పెద్దచెరువు మత్తడి పోయడంతో కోడూరు నుంచి పాలకుర్తికి వెళ్లే రోడ్డుపై నీరు రావడంతో రాకపోకలు నిలిచి ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. మండలకేంద్రంలోని ఆర్‌వీఎస్ కాంప్లెక్స్ వద్ద హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వర్షంపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం తెలుసుకున్న జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నరేష్‌యాదవ్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని రెండు జేసీబీల సహాయంతో హైవే రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను తొలగించి నీటిని మళ్లించారు. దీంతో హైవే పై నిలిచిన వాహనాలు సుమారు గంటకు పైగా అంతరాయం కలిగింది. సంఘటన స్థలానికి డీసీపీ రాజ మహేంద్రనాయక్ చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన సీఐ ఎస్ఐలను అభినందించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ అల్పపీడణ ప్రభావంతో వర్షాలు పడుతున్నందున అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. నీరు నిలిచి వాహనాలకు అంతరాయం కలిగిన ప్రాంతాన్ని అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు సలహాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ విమల, ఆర్ఐ శరత్‌చంద్ర, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కవిత, పాల్గొన్నారు.

# స్తంభించిన రాకపోకలు..అప్రమత్తమైన అధికారులు

**పాలకుర్తి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :**

పాలకుర్తి మండలం నుంచి దర్దెపల్లి మార్గమధ్యలో వాగు కల్వర్టు మీదుగా ప్రవహిస్తుండడంతో వాగును అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ సందర్శించి పరిశీలించారు. రెండురోజులనుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చెరువులన్నీ మత్తడిపడి వాగులనుంచి గ్రామాలకు పోవడానికి సౌకర్యాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయిని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అవసరమైతే బయటకు రావాలని కోరారు. వావిలాల నలగాని తండాలో మధ్య రోడ్డు వర్షానికి తెగిపోయిందని, అదేవిధంగా బొమ్మెర దుబ్బతండా వాగు దాటనీయకుండా ప్రవాహం పెరుగుతుందన్నారు. కోతులబాద్ నుంచి పాలకుర్తికి వచ్చ దారిలోకూడా వాగులు పొంగిపొర్లుతున్నాయన్నారు. పొంగిపొర్లుతున్న వాగులను ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏడబ్ల్యు ఈఈ సమంత్, ఎంపీడీవో రాములు, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్, లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జలగంకుమార్ సందర్శించి పరిశీలించారు.

**– వర్షానికి కూలిన ఇంటి గోడలు..:**

పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన గ్యార యాకయ్య ఇంటి పడారి గోడ పాత ఇల్లు మట్టిల్లు కూలి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తలదాచుకోవడానికి కూడా ఇల్లు లేకపోవడంతో కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించారు. సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ తీసుకని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.





# జనగామ వార్త



## ఘనంగా శ్రీసోమేశ్వర స్వామివారికి క్షబిల్వార్చన

**పాలకుర్తి, సెప్టెంబరు1 ప్రభాతవార్త :**



పాలకుర్తి మండలకేంద్రంలో శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా లక్షబిల్వార్చన మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, స్వామివారికి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. చండిక అమ్మవారి ఆలయంలో చండికాసమేత శ్రీసోమేశ్వర స్వామివారికి మాసకళ్యాణం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛ రణల మధ్య మహా వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్స వంలో భక్తులు పాల్గొని కనులారా తిలకించి తరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్‌బాబు, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగాఉండాలి

– నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి



**పాలకుర్తి, సెప్టెంబరు। ప్రభాతవార్త :** ఎమ్మెల్యే యశస్విని ఆదేశాల మేరకు వరద బాదితులను నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా తొర్రూరుకు వెళ్లే వాగును సందర్శించి పరిశీలించారు. అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో చెట్లు విరిగి దారికి అడ్డంగా పడిపోయాయని, వాహనదారులకు ఇబ్బంది ఉండడంవల్ల విరిగిన చెట్లను తొలగించి ప్రజలకు ధైర్యం చెప్పినట్లు తెలిపారు. తొర్రూరు గ్రామానికిచెందిన పసులాది వెంకన్న ఇల్లు భారీ వర్షాల కారణంగా నేలమట్టం కాగా ఇంటికి వెళ్లి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయం కింద ఆర్థికసాయం చేసి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండలపార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆలీంపూర్ రెడ్డిసంఘం నూతన కమిటీ ఎన్నిక



**బచ్చన్నపేట, సెప్టెంబరు। ప్రభాతవార్త :** ఆలీంపూర్ రెడ్డి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గంట తిరుమల్‌రెడ్డి, అధ్యక్షులుగా గూడ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పోరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంట తిరుపతిరెడ్డి, కోశాధికారిగా తొగిట బాల్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత కమిటీ రద్దుకావడంతో నూతన కమిటీ అనివార్యమైందనాననరు. నూతన అధ్యక్షుడు గూడ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అన్నివిధాల కృషిచేస్తానని తెలిపారు. ఇందుకు సంఘ సభ్యుల సహకారం ఎంతో అవసరం అన్నారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

లేనిచో ఉద్యమాలను ఉధృతం చేస్తాం

జేఏసి ములుగు జిల్లా నాయకులు పోలు రాజు

జేఏసి నాయకులు ఏళ్ల మధు సూదన్, సతీష్ కుమార్

టిటియు జిల్లా అధ్యక్షులు ఎండీ. సర్వర్ అహ్మద్



**ములుగు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం సిపిఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం ఉదయం 10.30 నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మరియు జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం ముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ ములుగు జిల్లా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తదనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ పెన్షన్ విద్రోహ దినాన్ని ఉద్దేశించి టీజీఈ జేఏసీ చైర్మన్ పోలు రాజు మరియు వివిధ సంఘాల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రద్దుచేసి ఉద్యోగులకు భరోసా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రేస్ ప్రభుత్వం సిపిఎస్ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకోవాలని వారు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు సతీష్ కుహార్, ఏళ్ల మధుసూదన్, ఎండీ. సర్వర్ అహ్మద్, అన్నవరం రవికాంత్, జనగాం బాబురావు, హట్కర్ సమ్మయ్య, మేడి చైతన్య, కుమార్ పాడియా తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు గండ్లు అప్రమత్తమైన అధికారులు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

–చెరువులకు కుంటలకు గండ్లు పడటంతో అధికారులు అప్రమత్తమై నివారణ చర్యలు తీసుకున్నారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పాపయ్యపేటలోని ఊరచెరువు తూము వద్ద బుంగపడిందని స్థానికులు పేర్కొన్నారు. అందిన సమాచారంతో మండల అధికారులు వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయమే తహసీల్దార్ ఫణికుమార్, ఎంపిడివో శ్రీవాణి, ఎస్ఐ అరుణ్, నీటిపారుదల శాఖ డీఈ ఏ.వెంకటరామ్‌ప్రసాద్, ఏఈ ఎం.సురేష్ తదితరులు చెరువు కట్టలకు చేరుకున్నారు. స్థానిక రైతులతో కలిసి నివారణ చర్యలు చేపట్టారు. పడిన బుంగను పూడ్చి ప్రమాదాన్ని నివారించారు. దీంతో రైతులు సైతం అప్రమత్తమై అక్కడికి చేరుకొని అధికారులకు సహకరించారు. కాగా



కాల్‌నాయక్‌తండా గ్రామ శివారు చింతలకుంట చెరువు వదర తాకిడితో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు రాంప్రసాద్, సురేష్‌లు అక్కడికి చేరుకొని రైతులను అప్రమత్తం చేసి నివారణ చర్యలు తీసుకున్నారు. ఇలా మండల స్థాయి అధికారులంతా భారీ వర్షం కురుస్తున్నప్పటికి ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నయ చర్యలు తీసుకున్నారు.

## గ్రామాల్లో తక్షణమే హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

దుగ్గొండి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



ఈ వర్షాకాలంలో గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం ఫంక్షన్‌హాల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాదులు ఉదృతి చెందకుండా చర్యలు తీసుకోవాలని, హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. పాలకుల వైఫల్యాల వల్లే ప్రజలకు ఇబ్బందులు ఎర్పడుతున్నాయన్నారు. స్థానిక సమస్యలపై పార్టీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు కదలి ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో అతివృష్టి అనావృష్టి సంబవించినప్పుడు ప్రజలను కాపాడుకునే విధంగా ప్రణాళికలు రూపొందించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తూ వైఫల్యం చెందుతున్నారన్నారు. ప్రజలు ప్రాణ నష్టం, పంట నష్టం, ఆస్థి నష్టంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగతి మల్లికార్జున్, గోనె కుమారస్వామి, కుసుంబబాబురావు, నాగెల్లి కొమురయ్య, మహ్మద్ రాజాసాహెబ్, ఎల్లబోయిన రాజు, బుడిమె సురేందర్, గటికె కోటేశ్వర్ బత్తిని, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పదో వార్డును పరిశీలించిన కౌన్సిలర్

**నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పెద్ద కాలువలో గుర్రపుడెక్క ఇతర వ్యర్థాలు జామయి వరద నీరు కట్టపై నుండి ఇండ్లలో చెరుకోవడంతో వెంటనే అప్రమత్తమైన వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ భారీ వర్షంతో కట్టపై నుండి వరద నీరు వివేకనంద కాలనీ వైపు మళ్లడంతో చాలా ఇండ్లలోకి నీరు చేరుకోవడం జరిగిందని వెంటనే స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ అధికారులకు తెలియపరిచి జెసిబి పిలిపించి కాలువలో జామ అయినటువంటి గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను తొలగించి భారీ ప్రమాదం నుండి కాపాడారు. అక్కడి ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## అలుగుపోస్తున్న దుగ్గొండి పెద్దచెరువు



**దుగ్గొండి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** మండలంలో గత మూడు రోజుల నుండి ఈదుర గాలులతో భారీ వర్షం కురుస్తుంది. దుగ్గొండిలో వర్షాపాతం నమోదు 106.4 మిలీ వర్షాపాతం నమోదైంది. వరద ప్రవాహానికి దుగ్గొండి పెద్ద చెరువు నిండి అలుగు పోస్తుంది. మండల కేంద్ర ప్రజలు చెరువు నిండటంతో రైతులు పంటలు పండుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా గత మూడు నుండి భారీ వర్షాలకు 34 గ్రామాల్లో రైతుల పంటలు పత్తి, మిరప, పసుపు, వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. భారీ వర్షాలకు పంటలు నీళ్లలో నిండిపోయాయి. కాగా లక్ష్మీపురం ఆరు మోరీల కాజ్వేను ఎంపిడివో డా.అరుందతి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఏడాదిలోపు బ్రిడ్జి మంజూరు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



లోలెవల్ కాజ్వే వద్ద ఏడాదిలోపు బ్రిడ్జి నిర్మాణం మంజూరి చేయిస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట చెన్నారావుపేట మార్గ మధ్యలో పాతముగ్ధుంపురం గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న లోలెవల్ వంతెనను ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. వరద ప్రవాహం ప్రయాణికుల ఇబ్బందులు తదితర వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట చెన్నారావుపేట నెక్కొండ మండలాలను కలుపుతున్న ఈ మార్గం ఎంతో ముఖ్యమైనదన్నారు. ఈ మార్గంలో లోలెవల్ వంతెన వద్ద ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఏడాది కాలంలోనే ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి మంజూరి ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, కాంగ్రెస్ మండల పార్టీ అద్యక్షులు భూక్య గోపాల్‌నాయక్, మాజీ ఎంపిపి వీరారెడ్డి, పోలెపెల్లి బిక్షపతి, నన్నెబోయిన రమేష్‌యాదవ్, ననుమాస కర్ణాకర్, కుండె కుమారస్వామి, బొంత శ్రీనివాస్, ననుమాస వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా పాఖాల మత్తడి

–పర్యటకులకు బ్రేక్

–నర్సంపేట– కొత్తగూడ రాకపోకలు బంద్



**ఖానాపురం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** బంగాళఖాతంలో ఏర్పడ్డ వాయు గుండం కారణంగా గత రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాల వల్ల పాఖాల సరస్సు నిండి రెండున్నర ఫీట్ల మేర పాఖాల మత్తడి పోస్తుంది. ఉధృతంగా పాఖాల మత్తడి పోస్తుండటంతో పర్యటకులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా పాఖాల మత్తడి ప్రాంతానికి పోలీసులు అనుమతించలేదు. పాఖాల మత్తడి ప్రాంతాన్ని ఎంఆర్వో కిరణ్ ఎంపిడివో భారతి, ఎస్ఐ రఘుపతి మత్తడి ప్రాంతాన్ని పరిశీలించారు. అశోక్‌నగర్ లోలెవ్ బ్రిడ్జి వద్ద పాఖాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భారీ గేట్లను ఏర్పాటు చేసి అటువైపు రాకపోకలను నిలిపివేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రజలందరు అతిభారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని అన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

పరకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



పరకాల పట్టణంలో గ్రామ దేవత పోచమ్మకు బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రావణమాసం చివరి రోజు కావడంతో పట్టణంలోని ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. పట్టణ వాసులు పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లేలా చూడాలని బోనాల నైవేద్యాన్ని సమర్పించారు.

# కుండపోత వర్షం...స్తంభించిన జనజీవనం





-రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు

-ఎడతెరిపిలేకుండా ఏకదాటిగా కురుస్తున్న వాన

-మత్తడి దుంకుతున్న చెరువులు..

పరకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది.భారీ వర్షాలకు ఇంట్లోంచి కాలు బయటపెట్టలేని స్థితి నెలకొంది.ఏ రోజు కారోజు జీవనాధారం కలిగిన చిరు వ్యాపారులు వాన ముసురు వల్ల వ్యాపారం లేక ఉపాధి కోల్పోయారు.పరకాల పరిసర గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది పట్టణంలో చిరు వ్యాపారాలు చేసుకునే నిమిత్తం వస్తుంటారు.ఇటువంటి వారి వ్యాపారాలన్నీ లేకుండా పోయాయి.వర్షంతో వ్యాపారాలు స్తంభించాయి.ఇంట్లోంచి బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో జన జీవనం స్తంభించింది.పరకాల పట్టణంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తునే వుంది.రోడ్లన్నీ జలమయం అయ్యాయి.హన్మకొండ రోడ్డు,భూపాలపల్లి రోడ్డు, హుజురాబాద్ రోడ్డు, శ్రీనివాస కాలనీ, మమతా నగర్, వికాస్ నగర్ జల మయంగా మారాయి.దీంతో పలు రోడ్లన్నీ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పరకాల, నడికూడ, శాయంపేట, ఆత్మకూర్ దామెర మండలాల్లో విస్తారంగా వర్షాల వల్ల గ్రామాల మధ్య రహదారులు జలదిగ్భంధ మయ్యాయి. కంఠత్మాకూర్, కటాక్షపూర్, తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ మునిగిపోయాయి. గ్రామాలు వానతో చిత్తడిగా మారాయి.వాగులు, చెరువులు, కుంటలు పొంగిపోర్లుతున్నాయి.పరకాల పట్టణం వరద నీటితో నిండు కుండల్లా మారాయి.కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి.ఎటు చూసినా వర్షం నీరు కనిపిస్తోంది.మరో రెండు రోజుల వరకు వర్షాలు కురుస్తూనే వుంటాయని అంచనా వేస్తున్నారు.

### వణికిస్తోన్న పురాతన భవనాలు...

గత నలభై ఎనిమిది గంటలుగా కురుస్తోన్న భారీ వర్షాలకు పరకాల పట్టణం తడిసి ముద్దయింది.ఎటు చూసినా వర్షపు నీటితో చిత్తడిగా మారింది.కురుస్తోన్న భారీ వర్షాలకు పట్టణంలోని పలు రోడ్లు జలమయం కావడమే కాకుండా రోజుల తరబడి నీటిలో నానడం వల్ల పురాతన భవనాల్లో ఏ ప్రమాదం మంచుకోస్తుందో అనే భయం నెలకొంది.కాలం చెల్లిన ఈ భవనాల్లో నివాసం ఉండకూడదని, ప్రమాదభరితంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ తరహా పురాతన పెంకుటిళ్లు,భవనాలు గత రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు నానిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని వణికిస్తున్నాయి.అవసరమైన అప్రమత్త చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.పరకాల పురపాలక సంఘం వీటిని ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు.ఇదిలా ఉండగా పట్టణంలో వరద నీటితో మునిగిపోయిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు నీటిని తోడేందుకు మున్సిపల్ చర్యలు చేపట్టింది.అదేవిధంగా ప్రతీ వర్షానికి యధావిధిగా మునిగిపోయే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పురపాలక సంఘం అప్రమత్తత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




## చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పరకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన విషాకర సంఘటన పరకాల మండలంలోని రాజీపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజీపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గువ్వ రాములు శుక్రవారం పరకాల సమీపంలో ఉన్న పెద్ద చెరువులో చేపలు పట్టడానికి దిగాడు.వల వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. గువ్వ రాములు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## అధిక వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నీట మునిగిన పంటలు



**తరిగొప్పుల, సెప్టెంబరు I ప్రభాతవార్త :** రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భారీగా వరద నీరు రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా మండల తహీసల్దార్ నాగేశ్వరచారి, స్థానిక ఎస్ఐ శ్వేత ఆదివారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వరదలు పెరుగుతున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి వారు వివరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప ఇళ్లనుంచి బయటకు రావాలని, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, వీటిని దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. శిథిలమైన, దెబ్బతిన్న పూరిగుడిసెల్లో నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కరెంటు స్తంభాలు, కరెంటు తీగలవద్ద ఇండ్లలో కరెంటు విషయంలో కూడా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వీరితోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### - నీట మునిగిన పంటలు..:

భారీ వర్షాల నేపథ్యంలో పలు గ్రామాల్లో వరిపంటలు ముంపు బారిన పడి నీటమునిగాయి. మండలకేంద్రంలోని పెద్దచెరువు మత్తడి పోయడంతోనీటి ఉధృతి ఎక్కువైంది. మత్తడి నిర్మాణం లోపం వల్ల బయటకువెళ్లే మార్గం లేక పంటలు ముంపుకు గురికావడంతో రైతన్నలు ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట మొత్తం కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

-పరకాల సిఐ క్రాంతికుమార్



**పరకాల, సెప్టెంబర్ I, ప్రభాతవార్త** గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పరకాల సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.ఆదివారం గణేష్ మండపాల ఆర్గనైజింగ్కమిటీ సభ్యులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటులో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.వివాదాస్పద స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.ప్రజలకు ఇబ్బందలు కలుగకుండా రోడ్డుకు అడ్డంగా మండపాలను ఏర్పాటు చేయవద్దని తెలిపారు.విగ్రహాల వద్ద వీఐపీలు వస్తే పోలీసులకు తగు సమాచారాన్ని చేరవేయాలని అన్నారు.ఇతరుల స్థలంలో మండపాలను ఏర్పాటు చేస్తేసదరు యజమాని నుంచి పర్మిషన్ తెచ్చుకోవాలని సూచించారు.విగ్రహాల వద్ద ఎల్లప్పుడు ఆర్గనైజర్లు అందుబాటులో ఉండాలని అన్నారు.నిర్వాహకులు ఫోన్ నంబర్లను పోలీసు స్టేషన్లో అందజేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు, మండపాల నిర్వాహులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు బోనాలు శుభాకాంక్షలు తెలిపిన శ్రీధర్‌రావు

చిల్పూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :

చిల్పూరు మండలంలో ఉన్న గ్రామాలలో ఆదివారం శ్రావణమాసం చివరిరోజు సందర్భంగా శ్రీపతిపల్లి, మల్కాపూర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు బోనాలతు మొక్కులు చెల్లిస్తున్నారు. ఈసందర్భంగా వారికి బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్, శాశ్వత ధాత పొట్లపల్లి శ్రీధర్‌రావు శుభాకాంక్షలు తెలియచేశారు.

## యాదవ్‌హక్కులపోరాట సమితి మండల అధ్యక్షుడిగా రమేష్‌యాదవ్



**రఘునాథపల్లి, సెప్టెంబరుI ప్రభాతవార్త :** మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోటకూర రమేష్‌యదవ్‌ను యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షునిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేశ్ యాదవ్ ఆదివారం ఉత్తర్వ్యులుజారీచేశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తన మీద దయ ఉంచి తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని యాదవ హక్కులకోసం పోరాడుతూ యాదవులందరినీ సంఘటితంగా ముందుకు తీసుకెళ్లుతానని తెలిపారు.

## చీకటిలో కాలనీ వాసులు

చిల్పూర్, సెప్టెంబరు1 ప్రభాతవార్త :



చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామంలోని 8వ వార్డులో గత వారంరోజుల నుంచి వీధిలైట్లు రాకపోవడంతో కాలనీ మొత్తం చీకటిమయమైంది. దీంతో కాలనీ వాసులు వారం రోజులుగా చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. రాత్రివేళ నిత్యఅవసరాలకు వెళ్లాలన్నా కుక్కల బెడద ఉందని, అందువల్ల చీకటిలో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వీదిలైట్లు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలోరాకేష్, చందు, రాజయ్య,రజనీకాంత్,రాజు,రాకేష్,సాంబరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘానికి రూ.లక్ష ఆర్థికసాయం చేసిన మాలోతురాజు

**చిల్పూర్, సెప్టెంబరుI ప్రభాతవార్త :** చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాలోతు రాజు అదే గ్రామానికి చెందిన శ్రీపతిపల్లి బొడ్రాయి దగ్గర ఉన్న అంబేద్కర్ సంఘం వాసులు రాజును మర్యాదపూర్వకంగా కలువగా డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహ మరమ్మతలకోసం సంఘానికి లక్షరూపాయల చెక్కును అందచేశారు. ఈకార్యక్రమంలో మోతె కొమురయ్య, మోతెరాజు, రొడ్డ సుధాకర్, టేకులపల్లి రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# బీఎంఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనలు

=ఈనెల సెప్టెంబర్ 3 నుండి 10 వరకు నిరసన
=ఈనెల 26న జీఎం కార్యాలయాల ముందు ధర్నా
=ఈనెల 30న చలో కొత్తగూడెం
=బీఎంఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ అప్పాని శ్రీనివాస్



**భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త** కోలిండియా, సింగరేణి బొగ్గు పరిశ్రమలో కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి పరిశ్రమలో సెప్టెంబర్ మాసంలో ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అప్పాని శ్రీనివాస్ వెల్లడించారు. గత నెల 13న నాగపూర్‌లో జరిగిన పదాధికారుల సమావేశంలో దేశ వ్యాప్తంగా కోలిండియా, సింగరేణి బొగ్గు పరిశ్రమలో కార్మికుల సమస్యలను సాధించటం కోసం సెప్టెంబర్ 3 నుండి 10 వరకు ఏరియాల వారిగా, సెప్టెంబర్ 26న జీఎం కార్యాలయాల ముందు, ఈనెల 30న చలో కొత్తగూడెం కార్యక్రమను చేపట్టాలని నిర్ణయించటం జరిగిందన్నారు. కోలిండియాలోని అన్ని అనుబంధ కంపెనీలలో యూనియన్ సభ్యత్వ ధృవీకరణ నమోదు పద్ధతి కొనసాగాలని, 11వ వేతన ఒప్పందంలో ఆమోదించిన అన్ని డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, కోలిండియా, సింగరేణి అన్ని కంపెనీలలో సూపర్ స్పెషాలిటి వైద్య సదుపాయం కల్పించాలని, వైద్య అధికారులను, పారా మెడికల్ సిబ్బందిని నియమించి పరికరాలను సమకూర్చాలని కోరారు. కోలిండియా, సింగరేణిలో క్యాడర్ స్కీంలను సవరించి బదిలీ వర్కర్ పేరును గౌరవ ప్రదంగా మార్చాలని కోరారు. కోలిండియా, సింగరేణిలో పనిచేస్తున్న మహిళలకు సాధికారతకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, కోలిండియాలో బొగ్గు గనుల కోసం భూసేకరణకు పరిహారం పెంచాలని, సిపిఆర్ఎంఎస్ పథకం కింద నగదు రహిత చికిత్స కోసం స్మార్ట్ కార్డులను అందజేయాలని, సింగరేణిలో కోలిండియా మాదిరిగా 50 వేలు చెల్లించాలన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ పెంచాలని, పెంచిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలను చెల్లించాలని సామాజిక భద్రత, జీతం, అలవెన్స్ వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు.

## 15వ వార్డులో మొక్కల పంపిణీ

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త



హరితహారం కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటి పరిధిలోని 15వ వార్డు కాకతీయకాలనీ, ఇందిరానగర్‌లలో ఇంటింటికి చెట్ల పంపిణీ కార్యక్రమను కౌన్సిలర్ నాగవెల్లి సరళరాజలింగమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. కాలనీలలోని ప్రతి ఇంటికి మొక్కలను అందజేసి నాటి సంరక్షించా లని కోరారు. ఈ కార్యక్రమంలో బాదం ప్రణతి, సులోచన, మాటూరు రాధ, సుమలత, సంగీత, మాకు జగదాంబ, తిప్పనవేణి సుమలత, రజిత, అంతడుపుల మమత, రజిత, అరుణ, పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసన

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త



ఉక్రేయిన్, పాలస్తీనాపై అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దమనకాండను నిరసిస్తూ సీపీఐఎం ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిరసన కార్యక్రమను చేపట్టారు. పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొనగా జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, నరేష్, సారయ్య, వసంతలక్ష్మి, జ్ఞానేశ్వరి, సుశీల, నరసమ్మ, దుర్గం రాజు, ధనంజయ, పగిడి పాల్గొన్నారు.

## గణపతి మండపంను ప్రారంభించిన ఎంఎల్ఎ జీఎస్సార్

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ హైటెక్ కాలనీలో నూతనంగా గణపతి మండపంను ఆదివారంను ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు, గణపతి మండపం భూమి పట్టాదారుడు ఉమామహేశ్వర్‌రావు, సీఐ నరేష్‌కుమార్‌లను కమిటీ మెంబర్‌లు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు సామల లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు తూడి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కుప్పల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి శ్రీనివాసరావు, కోశాధికారి బొమ్మకంటి పవన్‌కుమార్, పసునూటి సుమన్, కార్యదర్శి పున్నమినేని శ్రీనివాసరావు, సట్ల సురేష్, రామారావు, సలహాదారులు గొల్ల శ్రీనివాస్, ఆరెపల్లి ఓదెలు, సహాయక కార్యదర్శి చల్ల రవీందర్‌రెడ్డి, గోపతి రాజు, పైతరి మహేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రానికి వాటర్ ప్యూరిఫైడ్ అందజేత

**కాటారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్వయం కృషి స్వచ్ఛంధ సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీష్ ఆధ్వర్యంలో దాసరి రఘుపాల్ గౌడ్, వినయ్ గౌడ్ సహకారంతో వాటర్ ప్యూరిఫైర్‌ని అందజేశారు. ఈసందర్భంగా స్వయం కృషి స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు, సభ్యులను ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మౌనిక, సిబ్బంది, స్వయం కృషి సభ్యులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త



కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం టీజీఈ జేఏసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినంను పాటించారు. పట్టణంలో జేఏసి ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ బూరుగు రవి మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలుచేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించి నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సీపీఎస్ సాధన కోసం ఐక్యంగా పోరాటం చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు రేగూరి సుభాకర్‌రెడ్డి, బానోత్ సేవానాయక్, ఎం రామక్రిష్ణ, దశరథరామారావు, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, శనిగరం రమేష్, అయిత తిరుపతి, భార్గవ్, రాంబాబు, శివ, స్వప్న, ఉమాదేవి, కల్పన, లక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కట్టా రాంచంద్రమూర్తి, గాదం పోచయ్య, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు సరోజన తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఫిట్ కమిటీ ఎన్నిక

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త



సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి బ్రాంచీ వైస్ ప్రసిడెంట్ గడిపె చక్రపాణి ఆధ్వర్యంలో ఆదివారం కేటికే ఓసీ, అండర్‌గ్రౌండ్‌కు నూతన కమిటీని నియమించినట్లు తెలిపారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవి రావు ఆదేశాల మేరకు ఫిట్ కమిటీని ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఫిట్ సెక్రటరీగా మాతంగి రాంచందర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా నరసింహా నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగాఈ పుల్యాల తిరుపతి, బచ్చలి సమ్మయ్య, రిలే ఇంచార్జీలుగా అక్కపాక నర్సయ్య, బుర్ర శ్రీనివాస్, దాసరి లింగయ్య, మోరే శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ వైస్ ప్రసిడెంట్ బత్తుల వెంకటేశ్వర్లు, బ్రాంచీ నాయకులు ఓరం లక్ష్మణ్, కొచ్చెర్ల రవికుమార్, శ్రీనివాస్, రేణుకుంట్ల మల్లేష్, సమ్మయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటవద్దు..

-మండల పంచాయతీ అధికారి వీరస్వామి
-అలుగు వద్ద సిబ్బందికి, ప్రజలకు సూచనలు

**కాటారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై అలుగువాగు తీవ్రంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం ట్రాక్టర్ అడ్డుపెట్టి మండల పంచాయతీ అధికారి వీరస్వామి సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు ఎవరూ కూడా దాట వద్దని, అత్యవసరమైతేనే సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, జీపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వాడవాడల్లో నిఘా నేత్రాలు అమర్చుకోవాలి

భూపాలపల్లి, సెప్టెంబర్01, ప్రభాతవార్త




దొంగతనాల నిరోధం కోసం వాడవాడల్లో నిఘా నేత్రాలను అమర్చుకోవాలని భూపాలపల్లి సిఐ నరేష్‌కుమార్ కోరారు. పట్టణంలోని మంజూర్‌నగర్ హైటెక్ కాలనీ, జీఎంఆర్ కాలనీ ప్రజలతో ఆదివారం సమావేశం నిర్వహించిన సీఐ నరేష్‌కుమార్ దొంగతనాల కేసులలో సీసీ కెమెరాల ద్వారా నిందితులను సులభంగా పట్టుకునే అవకాశం ఉందని, ఇందు కోసం ప్రతి వాడలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.

# జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం





- కొట్టుకపోయిన పలు రహదారులు
- పొంగిపొర్లుతున్న వాగులు

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** జనగామ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షం నేపథ్యంలో పలుచోట్లు రహదారులు కొట్టుకపోగా, కొన్నిరహదారులు నీటమునగడంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. జనగామ జిల్లా లోని నర్మెట రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కాజువే వరద ప్రవాహానికి పూర్తిగా తెగి పోయింది. అలాగే లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కోసం వేసిన తాత్కాలిక డైవర్షన్‌రోడ్డు రాత్రినుంచి కురుస్తున్న భారీ వర్షానికి పూర్తిగా తెగిపోయింది. జనగామ నుంచి పాలకుర్తికి కుందారం మీదుగా వెళ్లాల్సిన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కుందారం, కిష్టగూడెం, చీటూరు, కోలుకొండ, పాల కుర్తికి వెళ్లాల్సిన వాహనదారులు ప్రత్యామ్నా యంగా నేలపోగుల, చిన్నమడూరు, అప్పిరెడినడపల్లి గ్రామాల మీదుగా వెళ్లుతున్నారు. అదేవిధంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు రఘునాథపల్లి మండలంలోని కోడూరు, గబ్బెట, కంచనపల్లి, మండేలగూడెం గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. కోడూరు పెద్దచెరువు మత్తడి పోయడంతో కోడూరు నుంచి పాలకుర్తికి వెళ్లే రోడ్డుపై నీరు రావడంతో రాకపోకలు నిలిచి ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. మండలకేంద్రంలోని ఆర్‌వీఎస్ కాంప్లెక్స్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వర్షంపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం తెలుసుకున్న జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేష్‌యాదవ్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని రెండు జేసీబీల సహాయంతో హైవే రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను తొలగించి నీటిని మళ్లించారు. దేవరుప్పుల మండలం మండలంలోని కడవెండి గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద గొర్రెలను కాస్తున్న గొర్రెల కాపరులు ఒకసారిగా వాగు ఉధృతంగా పెరగడంతో ప్రమాదవశాత్తు వాగులో జారిపడ్డ గొర్రెల కాపరులు ఉప్పుల చంద్రయ్య, మహ్మద్ అంకూస్‌లను గ్రామస్తులు కాపాడారు. కాగా, 150 గొర్రెలు మధ్యలోనే ఉండిపోవడంతో వాగులో కొట్టుకపోయాయి. సంఘటన స్థలానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చేరుకుని బాధితులను పరామర్శించారు. పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన గ్యార యాకయ్య ఇంటి పడారి గోడ పాత ఇల్లు మట్టిల్లు కూలి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తలదాచుకోవడానికి కూడా ఇల్లు లేకపోవడంతో కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించారు. సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ తీసుకని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. తరిగొప్పులలో భారీ వర్షాల నేపథ్యంలో పలు గ్రామాల్లో వరిపంటలు ముంపు బారిన పడి నీటమునిగాయి. మండలకేంద్రంలోని పెద్దచెరువు మత్తడి పోయడంతోనీటి ఉధృతి ఎక్కువైంది. మత్తడి నిర్మాణం లోపం వల్ల బయటకువెళ్లే మార్గం లేక పంటలు ముంపుకు గురికావడంతో రైతన్నలు ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో కొటు ్టమిట్టాడుతున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట మొత్తం కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# అనారోగ్యంతో కాంగ్రెస్ యువ నాయకుడు మృతి

-సంతాపం తెలిపిన ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

-నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**మల్హర్‌రావు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నస్పూరి నాగరాజు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున హైదరాఆబద్ నిమ్స్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. తల సంబంధిత సమస్యతో కొన్ని రోజులుగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిమ్స్ ఆసుపత్రకి చేరుకున్న శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు నాగారాజు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీలో నిరంతరం చురుకైన కార్యకర్తగా పేరు పొందిన నాగరాజు మృతదేహానికి మండల కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

# నాట్య కళాజ్యోతి ఆవార్డు అందుకున్న అలకనంద

మల్హర్‌రావు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన వర్ధమాన నాట్య కళాకారిని బానోతు అలకనంద రాథోడ్‌కు నాగశ్రీ సాంస్కృతిక శాఖ స్వర్ణ మధురిమ కల్చరల్ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం జరిగిన సుదీర్ఘ గానలహరి సంగీత సాంస్కృతిక కార్యక్రమంలో తనదైన శైలిలో నృత్య ప్రదర్శనలను ప్రదర్శించి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జీనియస్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ బింగి నరేందర్ గౌడ్, ముకుంద చారిట్రబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఖమ్మం చెరుకూరి రాజి, డా.ఎస్‌విఆర్ వెంకటేష్, కవి, గాయకులు కరీంనగర్ చేతుల మీదుగా 'నాట్య కళాజ్యోతి' అవార్డుని అందుకున్నారు. ముఖ్య అతిధి మాట్లాడుతూ..చిన్న వయసులో ఎంతో అద్భుతమైన నృత్య ప్రదర్శనలను ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అని అలకనందను అభినందించారు. కార్యక్రమంలో కవులు, గాయకులు, స్వర మధురిమ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్, ప్రముఖ న్యాయవాది జిల్లా లక్ష్మీనారాయణ, మ్యూజిక్ డైరెక్టర్ మాధవరావు, వివి రెడ్డి, మన్నెపల్లి మల్లిఖార్జున్, తల్లిదండ్రులు బానోత్ దివ్య-రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తెలిపారు. భారీ వర్షాలతో వరద నీటి ప్రవాహనల వలల ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అన్ని విధాల సహయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టర్‌లు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. ముఖ్యంగా శిథిలావస్థలో ఉండే కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లలో ఉండేవారు తగి జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, చెరువుల నీరు చేరే అవకాశం ఉన్న లోతట్టు గ్రామాల ప్రాంత ప్రజలను గుర్తించి వారిని తరలించాలని, ప్రజలకు ఎలాంటి ముప్పు రాకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలతో సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లాలోని కొన్ని లోతట్టు ప్రాంతాలలో గోదావరి పరివాహక ప్రాంతాలలో వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటుందని, కావున ప్రజలు అప్రమత్తగంఆ ఉండాలన్నారు. అధికారులు చెరువులు, కాలువలను గుర్తించి వెంటనే ప్రమాదం జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఇరు జిల్లాల కలెక్టర్‌లను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు.

# యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-చురుకుగా కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



**కాటారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా కాటారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంగా వేగంగా కొనసాగుతుంది. ఆదివారం కాటారం మండలకేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఏర్పాటు చేసిన ప్యానెల్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు మండలంలోని ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని నాయకులు కోరారు. అలాగే మంథని నియోజకవర్గంలోనే కాటారం మండలం సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చీమల రాజు, చీమల సందీప్, చీటూరి మహేష్, పసుల మొగిలి, కొట్టె ప్రభాకర్, మేడిపల్లి కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు

-ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

**మహాముత్తారం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జలదిగ్బంధంలో కూరుకుపోయాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జనజీవనం ఎక్కడికక్కడే స్థంభించి పోయింది. మండలంలోని కేశావపూర్-పెగడపల్లి మధ్య గల పెద్దవాగు భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచపోయాయి. మహాముత్తారం యామన్‌పల్లి మధ్య గల వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఎక్కడి వారే అక్కడే తమ పనులను వదులుకొని నిమ్మకుండి పోయారు. వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు జారీ చేసి సూచనలు చేస్తున్నారు. చెరువులు, కాలువలు, కుంటల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు గాను రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నచోట జాగ్రత్త వహించాలని, ఐరన్ విద్యుత్ స్థంభాలు ఉన్నచోట జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. వాహనదారులు ప్రయాణించ టప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి. గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ప్రమాదాలకు లోలై అవకాశాలుంటాయన్నారు. కావున ప్రజలు ఎవరూ కూడా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మరో రెండు రోజులు ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని, ఇప్పటికే కొంతమందికి నిత్యావసరాలు లేక ఆకలితో అలమటిస్తున్నట్లు తెలుస్తోంది. కావున సంబంధిత అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం అందేలా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



# ఎడతెరిపి లేకుండా కురిసిన కుంబవృష్టివాన





-పొంగిన వాగులు, వంకలు

-లోలెవల్ వంతెన పైనుండి వరద ప్రవాహం

-నర్సంపేట చెన్నారావుపేట మార్గంలో నిలిచిన రాకపోకలు

-కోనాపురం మార్గంలో దారి మళ్లింపు

-దెబ్బతిన్న పంట పొలాలు

-మండలంలో అత్యధికంగా 20 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదు

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** గతంలో ముందెన్నడు లేని విధంగా మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన కుంబ వృష్టి వానతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. ఏమాత్రం విరామం లేకుండా కురిసిన భారీ వర్షంతో జనజీవనం ఒ క్రమంలో భయాందోళనకు గురయ్యారు. ఎటుచూసినా వరద ప్రవాహం పరవళ్ల తొక్కింది. శనివారం రాత్రి నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు వరుణుడు ఉగ్రరూపాన్ని చూపించారు. దీంతో మండలంలో ఉన్నటువంటి చెరువులు కుంటలు మత్తళ్ల పోయగా వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. కాగా గడిచిన 24గంటల్లో మండలంలో అత్యధికంగా 20 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైనట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు.

-లోలెవల్ వంతెనపై వరద ప్రవాహం.. ప్రయాణికుల ఇబ్బందులు...

ఉనర్సంపేట, చెన్నారావుపేట ప్రధాన రహదారి పాతముగ్దుంపురంలో ఉన్నటువంటి లోలెవల్ వందెనపై వరద ఉద్ధృతంగా ప్రవహించింది. ఎగువన ఉన్నటువంటి ముగ్దుంపురం ఊరచెరువు పెద్ద ఎత్తున మత్తడి పోయడంతో వం వరద పొంగి ప్రవహించింది. దీంతో ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోగా ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. కాగా నెక్కొండ నుండి నర్సంపేటకు నర్సంపేట నుండి నెక్కొండకు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లారు. చెన్నారావుపేట నుండి కోనాపురం లింగాపురం మీదుగా దుగ్గొండి మండలం గిర్నిబావి నుండి 25 కిలో మీటర్లు ప్రయాణించి నర్సంపేటకు వెళ్లాల్సి వచ్చింది. లోలెవల్ వద్ద వంతెన నిర్మాణం చేపడితే ఇబ్బందులు తప్పేవని ప్రయాణికులు వాపోయారు.

-వరద ముంపులోనే పంట పొలాలు....

కాగా మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు వరద నీటిలో వరద ముంపుకు గురయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరి పొలాలు నీటిలో మునుగగా పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.


-పోలీసులు అప్రమత్తం....

లోలెవల్ కాజ్వేతో పాటు గ్రామాల్లో వరద ప్రవాహం పెరగడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఎస్ఐ అరుణ్ ఆధ్వర్యంలో గ్రామాలను సందర్శించి హెచ్చరికలు జారీ చేశారు.




## ప్రమాదవశాత్తు నీటిలో పడి వృద్ధురాలు మృతి

*దుగ్గొండి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన కోండ్రసమ్మక్క(75) అనే వృద్ధురాలు ప్రమాదవ శాత్తు లోలెవల్ కాల్వలో పడి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన కోండ్ర సమ్మక్క అనే వృద్ధురాలు మందపల్లి గిర్నిబావి గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. శనివారం గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం మధ్యాహ్నం గిర్నిబావి, దుగ్గొండి ప్రధాన రహదారిలో గల లోలెవల్ కాజ్వే వద్ద నీటి ప్రవాహంలో సమ్మక్క శవమై తేలింది. దుగ్గొండి ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు శవపంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలికి ఒక కుమారుడు సదయ్య కూతురు సాంబలక్ష్మి ఉన్నారు.

-మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి...



ప్రమాదవశాత్తు మృతిచెందిన కోండ్ర సమ్మక్క కుటుంబ సభ్యులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ పరామర్శలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, ఎంపిడివో డా.అరుందతి, ఎంపివో శ్రీధర్‌గౌడ్, డీటీ ఉమారాణి, ఆర్ఐ రాంబాబు, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షం బీభత్సం అతలాకుతలం అవుతున్న ప్రజలు

-డివిజన్‌లో పొంగిపొర్లుతున్న చెరువుల

-పలుగ్రామాలకు రాకపోకలు బంద్

*నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నర్సంపేట డివిజన్‌లో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డివిజన్‌లోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండు కుండల్లా తలపిస్తున్నాయి. ఆయా చెరువుల్లో మత్తళ్ల పరవళ్ల తొక్కుతున్నాయి. నర్సంపేట నుంచి చెన్నారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా మాదన్నపేట, గురిజాల, గ్రామాల మధ్య లోలెవల్ కాజ్వేల్లో వరద ఉదృతి పెరగడంతో రవాణా నిలిచిపోయింది. అదేవిధంగా పట్టణంలోని పలు వార్డులలో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జిల్లా యంత్రంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన ఎన్‌టిఆర్‌నగర్‌ను పరిశీలించారు. ముఖ్యంగా డివిజన్‌లోని పాఖాల రంగాయ చెరువు మాదన్నపేట చెరువులు నిండు కుండలా తలపిస్తున్నాయి. పాఖాల చెరువు రెండు ఫీట్ల ఎత్తుతో భారీగా మత్తడి ప్రవహిస్తుంది. ప్రభుత్వం భారీ వర్షాల కారణంగా మరో మూడు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు డివిజన్‌లోని నల్లబెల్లిలో 5.3 సెంటిమీటర్ల వర్షాపాతం నమోదుకాగా,



దుగ్గొండి 6.5 నర్సంపేట 13.8, ఖానాపురం 16.3, నెక్కొండ 52.3, చెన్నారావుపేట 81.0 మి.మీ వర్షాపాతం నమోదైంది. వర్షాల కారణంగా పట్టణంలోని 18వ వార్డులో వావిల్ల రజిత ఇల్లుకూలిపోయింది. ఇంకా భారీ వర్షాలు ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

-ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం నెక్కొండ మండలంలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలో ఆర్టీసి బస్ వరద ప్రవాహంలో సుమారు 45 మంది ప్రయాణికులు చిక్కుకోగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రయాణికులను లారీ సహాయంతో సురక్షిత ప్రదేశానికి తరలించి వారికి భోజన ఏర్పాటు, ఒక పాఠశాలలో వారికి వసతిని దగ్గరుండి ఎమ్మెల్యే, కలెక్టర్, కమీషనర్ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటికి వెళ్లోద్దని సూచించారు.

-లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే....

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నర్సంపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించాడు. నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌ను సందర్శించి వరద తీవ్రతను పరిశీలించారు. అధికారులు వరద తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, వరద ముప్పు పొంచి ఉన్నట్లయితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నగర ప్రజలతో మాట్లాడుతూ వారు సూచించిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కాలనీవాసులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఎన్టీఆర్‌నగర్‌కు సీసీ రోడ్డు సౌకర్యం త్వరలోనే కల్పిస్తామని, కాలువలు, కల్వర్టులు వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారు. వరద తీవ్రతను పరిశీలించిన వారిలో నర్సంపేట ఆర్డీవో, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పాలాయి రవి, దండెం రతన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సంపేట మున్సిపల్ పరిధిలోని ముంపు ప్రాంతాలను పరిశీలించిన చైర్మన్

**నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** భారీ వర్షాల నేపథ్యంలో నర్సంపేట మున్సిపల్ పరిధిలోని ముంపు ప్రాంతాలను ఎన్‌టిఆర్ నగర్‌లో మున్సిపల్ కమిషనర్ ఏఈ, నర్సంపేట సీఐ, ప్రభుత్వ అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదేవిధంగా అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని లోతట్టు ప్రాంతాలలో నిర్మిస్తున్న వారిని గుర్తించి ముందుగానే తగు సహాయ చర్యలు అందించి అవసరమైతే వారికి సహాయ శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రభుత్వ పరంగా అన్ని విదాల సహాయ సహకారాలు, నిధులు అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



# పాకాల వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



రెండు రోజులుగా ఉధృతంగా కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న పట్టణ శివారులోని పాకాల వాగును మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. హైదరాబాద్ నుండి మహబూబాబాద్‌కు వెళుతున్న ఎమ్మెల్యే భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో వరద తాకిడికి సంబంధించి సమాచారం అందుకున్న క్రమంలో మార్గమధ్యంలోని గూడూరు వద్ద ఆగారు. స్థానిక పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి పాకాల వాగు ప్రవాహ ఉధృతిని ఆయన పరిశీలించారు. వాగు ప్రవాహం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులను కోరారు. కాగా లోలెవల్ వంతెన కారణంగా ప్రతి వర్షాకాలం వాగు వంతెనపై నుండి పొంగి ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులతో పాటు స్థానికులు విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా వంతెనపై మిషన్ భగీరథ పైపులైన్ ఉండడం వల్ల వాగు వరద సాఫీగా వెళ్లని పరిస్థితి ఉందని, దాని వలన్ల పరిసరాల్లోని పొలాలు ముంపుకు గురై రైతులు నష్టపోతున్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే ధృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వీరస్వామి, ఇంచార్జి తహసిల్దార్ కోమల, ఎంపిఓ సత్యనారాయణ, ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, ఐబి డిఇ ఉపేందర్‌లతో ఎమ్మెల్యే మాట్లాడి భారీ వర్షం నేపథ్యంలో చోటు చేసుకున్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సిహెచ్ స్వామి, యాకయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# గూడూరు వార్త

గూడూరు, కొత్తగూడ, గంగారం, కేసముద్రం

# చేపల వేటలో బిజీబిజీ

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



భారీ వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు పడే వారు కొందరైతే జిహ్వా చాపల్యం తీర్చుకునేందుకు ఆరాట పడేవారు మరికొందరు. ఎడతెరిపిలేని వర్షం వల్ల వరదలతో చెరువులు నిండి మత్తళ్లు పోయగా ఆ మత్తడి నీళ్లలో చేపలు పట్టేందుకు చాలా మంది సందడి చేసిన దృశ్యాలు పలు చోట్ల కనిపించాయి. ఎవరి గోల వారిదే అన్నట్లుగా వరద నీటిలో చేపలు పట్టేందుకు పలవురు వలలతో పరుగులు తీయడం కనిపించింది. మత్తడి నీటి వరదలో ఆయా చెరువుల్లో ఉన్న చేపలు కొట్టుకొస్తాయనే ఆశతో వలలతో వాటిని పట్టుకునేందుకు పోటీ పడ్డారు. పలు గ్రామాల్లో ఈ సందడి చోటు చేసుకోగా పట్టిన చేపలను కొనుక్కొని వెళ్లేందుకు కూడా జనం పోటీ పడ్డారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న ముసలమ్మబాడువా వరద నీటిలోకి వలలతో దిగిన పలువరు మూడు గంటల పాటు ఆ వరద నీటిలోనే ఉండి చేపల వేట కొనసాగించారు. అదేవిధంగా అయోధ్యాపురం పెద్ద చెరువు ఆదివారం ఉదయం మత్తడి పోయడంతో అక్కడ కూడా చేపలు పట్టేందుకు వలలతో పరుగులు తీసారు. మత్తడి పొడవునా వలలు పట్టుకొని చేపలు పట్టేందుకు నిలుచున్న తీరు ముచ్చటగా కనిపించింది.

# పొంగుతున్న వాగులు-మత్తళ్లు పోస్తున్న చెరువులు

## భారీ వర్షంతో గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు

## అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మండల ప్రజలను అతలాకుతులం చేసాయి. ఆకాశమంతా పూర్తిస్థాయిలో మేఘావృతం కాగా వర్షం పడుతున్న సమయంలో ఏకధాటిగా చోటు చేసుకున్న మెరుపులు, భారీ శబ్దాలతో ఉరుములు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసాయి. భారీ వర్షం కారణంగా ఏర్పడిన వరద నీటితో చెరువులు నిండుకుండలా మారి మత్తళ్లు పోస్తుండగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వీధులు జలమయం కాగా కొన్ని చోట్ల ఇళ్లల్లోకి కూడా నీరు చేరుకుంది. గూడూరు సమీపంలోని పాకాలవాగు వంతెనపై నుండి పొంగి ప్రవహిస్తుండడంతో గూడూరు-నెక్కొండ, గూడూరు-కేసముద్రం మార్గాల్లో శనివారం రాత్రి నుండి రాకపోకలు నిలిచిపోయాయి. మండలానికి చెందిన వాగు అవతలి గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం మండ కేంద్రానికి దామరవంచ, గోవిందాపురం వంతెనల మీదుగా చేరుకున్నారు. మండల అధికారులు, పోలీసులు వాగు వద్ద భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు సిబ్బంది కాపలా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలు ఎవరు వాగు నీటిలోకి వెళ్లకుండా చూసారు. ఇంచార్జి తహసిల్దార్ కోమల, ఎంపిడిఓ వీరస్వామి, ఎంపిఓ సత్యనారాయణ, ఐబి డిఇఇ ఉపేందర్‌లో మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టారు. పొంగి పొర్లుతున్న కాజ్‌వేలను, మత్తళ్లు పోస్తున్న చెరువులు, కుంటలను పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేసారు. అయోధ్యాపురం శివారు వాయిలుబందం సమీపంలో చెరువుకు చెందిన కట్టుకాలువ కోతకు గురై వరదనీరు ఆ గ్రామంలోకి చేరడంతో ఐడి డిఇఇతో పాటు ఆ గ్రామ పంచాయతి కార్యదర్శి ఆధ్వర్యంలో వెంటనే అవసరమైన చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా దామరవంచ సమీపంలో పాకాల వాగు ఒడ్డున ఉన్న పిల్లిగుండ్లతండాలో కొన్ని ఇళ్లు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని గమనించిన అధికారులు అక్కడికి వెళ్లి నాలుగు కుటుంబాల వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఒకరి ఇంటి మట్టి గోడ కూలిపోయింది. వర్షం కురిసిన సమయంలో పిడుగుపాటు సంఘటనల్లో మండలానికి చెందిన ఒక వృద్ధురాలితో పాటు ఒక కాడెద్దు కూడా మృతి చెందిన సంఘటనలు విశాదాన్ని మిగిల్చాయి. గాలి, వర్షం ధాటికి కొన్ని చోట్ల చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడడడంతో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. దీని కారణంగా శనివారం, ఆదివారం రోజుల్లో మధ్యమధ్యన కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

# జలదిగ్బంధంలో ఆదివాసీ గ్రామం

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ గ్రామం దొరవారితిమ్మాపురం జలదిగ్బంధానికి గురైంది. ఈ గ్రామం చుట్టు ఉన్న వాగులు పొంగి ప్రవహించడంతో బయటి ప్రపంచంతో ఆ గ్రామవాసులకు సంబంధాలు తెగిపోయాయి. వాగుల కారణంగా రాకపోకలు నిలిచి పోవడంతో ఆదివాసీ కుటుంబాలు గ్రామానికే పరిమితమైపోయాయి. వాగుల ప్రవాహ ఉధృతి తగ్గితే తప్ప వారు గ్రామం నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదని తెలుస్తున్నది. ఇదిలా ఉండగా తమ గ్రామానికి ఉన్న విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్థంభాలలో ఒకటి వాగు కారణంగా పడి పోవడంతో శనివారం ఉదయం నుండి తమ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఆ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు పెనక మహేందర్ తెలిపారు. దీంతో గ్రామం అంధకారంలో ఉండి పోతున్నదన్నారు.

# పిడుగు శబ్దానికి భయపడి... వృద్ధురాలు మృతి

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



తమకు సమీపంలో పిడుగు పడడంతో ఆ శబ్దానికి భీతిల్లిన ఓ వృద్ధురాలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన సంఘటన మండలంలోని బొల్లెపెల్లి శివారు ఎస్సీకాలనీలో శనివారం రాత్రి జరిగింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా శనివారం ఉదయం నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్న విషయం తెలిసిందే, ఇదే క్రమంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో మెరుపులు, ఉరుములతో గంటపాటు భీభత్సంగా వర్షం కురిసింది. ఈ సందర్భంలో కొన్ని చోట్ల పిడుగులు కూడా పడ్డాయి. మండలంలోని బొల్లెపెల్లి శివారు ఎస్సీకాలనీ సమీపంలో కూడా శనివారం రాత్రి పిడుగు పడడంతో తన పూరి గుడిసెలో ఒంటరిగా పడుకొని ఉన్న కోరె తిరుపతమ్మ (57) అనే వృద్ధురాలు ఆ శబ్దానికి ఒక్కసారిగా భయపడింది. దీంతో ఆ భయానికి ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసారు.

# పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి

*గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*



పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని రాజనపల్లి కాల నీతండాలో జరిగింది. తండావాసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన మాలోతు భద్రు అనే రైతు తనకున్న దుక్కిటెద్దులను ఇంటి ముందు ఉన్న ఓ చెట్టు కింద కట్టేసి ఉంచాడు. కాగా శనివారం రాత్రి భారీ వర్షంతో పాటు చోటు చేసుకున్న మెరుపులు, ఉరుములు భయాందోళనకు గురి చేసాయి. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో చెట్టుకు కట్టేసి ఉన్న దుక్కిటెద్దు ఒకటి అక్కడికక్కడే మృతి చెందిందని తండావాసులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.75వేలు ఉంటుందని తెలిపారు. అధికారులకు ఈ సంఘటనపై సమాచారం అందించి ఎద్దును ఖననం చేసినట్లు తెలిపారు.

# అకాల వర్షం...అపార నష్టం







-ఆకేరువాగులో పడ్డ తండ్రికూతుళ్లు
-కూతురు మృతదేహం లభ్యం తండ్రి ఆచూకికోసం గాలింపు
-పాలేరువాగులో పడి రెండు కాడెడ్లు,గేదె,దూడ,రెండు పాడిగేదెలు మృతి
-మరిపెడలో రెండు పెంకుటిల్లు నెలమట్టం
-జలదిగ్బంధంలో పలు గ్రామాలు, తండాలు

**మరిపెడ,సెప్టెంబర్1.ప్రభాతవార్త** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మున్సిపాలిటి కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని పురుషోత్తమాయగూడెం ఆకేరువాగులో కారులో ప్రయాణిస్తున్న తండ్రికూతుళ్లు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే ఖమ్మంజిల్లా సింగరేణి మండలం గేటు కారేపల్లి గంగారం తండాకు చెందిన లూనావత్ మోతీలాల్ తండ్రి, కూతురు అశ్విని ఇద్దరు కారులో ఆదివారం ఉదయం హైద్రాబాద్ వెళ్తున్న క్రమంలో పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరువాగు ఉద్రుతంగా ప్రవహిస్తుండడంతో అదుపుతప్పి కారు నీటిలోకి వెళ్లింది. తమ కారు నీటిలోకి వెళ్లిందని, మా మెడల వరకు నీరు వచ్చిందంటూ బంధువులకు ఫోన్ చేశారని స్థానికులు తెలిపారు. కారు కనిపించకుండా పోవడంతో మరిపెడ పోలీసులు గాలింపు సహాయక చర్యలు చేపట్టారు. అశ్విని మృతదేహం లభ్యంకాగా తండ్రి మోతిలాల్ మృతదేహం కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఆకేరువాగు విస్తృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరిపెడ సిఐ సట్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జలదిగ్బంధంలో చిక్కుకున్న సీతరాంపురం తండా వాసులకు, ప్రయాణికులకు భోజనం ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మండలంలోని రాంపురం గ్రామంలో వ్యవసాయ బావి వద్ద కొట్టంలో కట్టేసిన రెండు కాడేడ్లు, ఒక దూడ, గేదె పాలేరువాగు ఉద్రుతికి కొట్టుకపోయాయి. తాళ్లఊకల్ శివారు చింతలగడ్డతండాకు చెందిన ఆంగోతు సికిందర్ అనే రైతుకు చెందిన రెండు పాడిగేదెలు కొట్టుకపోయాయి. మరిపెడ మున్సిపాలటి పరిధిలోని పెంకుటిల్లు నెలమట్టం అయ్యాయి. ప్రధాన రహదారి వెంట ఉన్న వృక్షాలు నేలమట్టం కావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత రెండు రోజులుగా విద్యుత్ నిలిపివేయడంతో పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.

# వరద ముంపులో ఆర్టీసి బస్సు





-డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం
-నెక్కొండకు తరలివచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ
-ప్రయాణికులకు తగిన సౌకర్యాల ఏర్పాట్లు

**నెక్కొండ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** వరద ముంపులో ఆర్టీసి బస్సు చిక్కుకోవడంతో డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన నెక్కొండ మండలంలో ఆదివారం ఉదయం నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వెంకటాపురం, తోపనపల్లి గ్రామాల మధ్యలో ఉన్న లోలెవల్ వంతెనపై నుండి వరద ప్రవాహం పొంగి ప్రవహించింది. ఈ క్రమంలో ఈ మార్గంలో వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు వెళుతున్న మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు వరదలో చిక్కుకున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో వరంగల్ నుండి నెక్కొండ మీదుగా మహబూబాబాద్‌కు వెళుతున్న బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. లోలెవల్ వంతెన వద్ద వరద ప్రవాహం పెరగడంతో డ్రైవర్ శ్రీనివాస్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో రెండు కల్వార్టుల మధ్య బస్సు ఇరుక్కుపోయిందన్నారు. అర్ధరాత్రి కావడంతో ప్రయాణికులు ఎటువెళ్లాలో తెలియక ఉదయం 6గంటల వరకు ప్రయాణికులంతా బస్సులో ఉండిపోయారు. అందిన సమాచారం మేరకు సిఐ చంద్రమోహన్, ఎస్ఐ మహేందర్‌లు ఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు.

**-తరలివచ్చిన ఎమ్మెల్యే కలెక్టర్ సీపీ...** బసుస వరదల్లో చిక్కుకున్న విషయం తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, సీపీ అంబర్‌కిషోర్‌ఝాలు ఘటన స్థలానికి చేరుకొని సమీక్షించారు. ప్రయాణికులను తరలించడానికి వీలు కాకపోవడంతో సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీతో బస్సును బయటకు తీయడానికి ప్రయత్నించారు. అయినా వీలు కాకపోవడంతో ప్రయాణికులంతా లారీపైకి ఎక్కి సురక్షితంగా వెంకటాపురం గ్రామానికి చేరుకున్నారు. ప్రయాణికులందరికి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాళిక వసతి ఏర్పాటు చేశారు. అలాగే ఎమ్మెల్యే దగ్గరుండి మరోబస్సులో మండల కేంద్రానికి ప్రయాణికులను తరలించారు. అనంతరం మిగతా ప్రయాణికులందరికి భోజన వసతి కల్పించి వారి గమ్యస్థనాలకు తరలించారు. కాగా రాత్రి నుండి ఉదయం వరకు తాము ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటు గడిపామని ప్రయాణికులు వాపోయారు. రాత్రి కావడం, జోరువానతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థిథి నెలకొందన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో తాము ప్రాణాలతో బయట పడ్డామన్నారు. అలాగే పోలీసు యంత్రాంగం అధికారులు సైతం తమకు అండగా నిలిచారన్నారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించిన ఆర్టీసి బస్సు డ్రైవర్‌ను అధికారులతో పాటు స్థానికులు అభినందించారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో జలద్రిగ్బందంలోనే ఉండిపోయారు. కాగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో వాతావరణ శాఖ ఆది, సోమవారాల్లో భారీ వర్షాల దృష్ట్యా జిల్లాను రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, లోలెవల్ వంతెనలు, కాజ్‌వేలు, వరద ప్రవాహం ఏర్పడే ప్రాంతాల మీదుగా రాకపోకలను జరపరాదని, కుండపోత వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటను చేయరాదని ఆయన కోరారు. జిల్లాలోని చెరువులు, కుంటలలోచేరుతున్న వరద ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించడంతోపాటు పట్టణ ప్రాంతాలలో డ్రైనేజీలు, మ్యాన్‌హోల్స్ కూరుకపోయి వర్షపునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురికాకుడా అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఉధృతంగా రోడ్లపై ప్రవహిస్తున్న వరదనీటిని, కల్వర్టుల వద్దగానీ రోడ్లను గానీ దాటరాదని తెలిపారు. వరద తాకిడి ఉన్న ప్రాంతాలలో గ్రామ ప్రజలు వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అధికారులకు సహకరిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. శిథిల భవనాలలో కూలిన ఇళ్లల్లో వర్షాలకు తడిసిన మట్టి గోడ ఇండ్లలో ప్రజలు నివాసం ఉండరాదని తెలియచేశారు. ఇతర జిల్లాల్లో చేపలను పట్టేందుకు వెళ్లినప్పుడు ప్రాణాపాయం జరిగిన నేపథ్యంలో జిల్లాలో మత్స్యకారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టేందుకు చెరువులు, వాగులు వంకల వద్దకు వెళ్లరాదన్నారు. అదేవిధంగా తడిసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ పోల్స్ వద్దకు ప్రజలు వెళ్లరాదని, వాటికి దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైన పనులు ఉంటేనే తప్ప బయటకు రావాలని లేనిచో ఇంటిపట్టునే ఉండాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 9052308621 కు కాల్‌చేసి ప్రజలు తమ సమస్యలను తెలియచేయాలన్నారు. గ్రామ మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో నేటి ప్రజావాణి రద్దు

- విద్యాసంస్థలకు సెలవు
- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

**జనగామ టౌన్, సెప్టెంబరు1 ప్రభాతవార్త :** భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశంతో నేడు (సోమవారం) జరగబోయే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు నేడు సెలవును ప్రకటించినట్లు తెలిపారు. నేడు సెలవు ఇస్తున్నందున ఈనెల 14వ తేదీన రెండవ శనివారం సందర్భంగా ఉన్న సెలవు విద్యాసంస్థలకు వర్తించదని ఆరోజున విద్యాసంస్థలు పనిదినంగా గమనించాలన్నారు.

## రెండు రోజులు భారీ వర్షాలు

-ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి..
-హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ



**కాళేశ్వరం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయగా మహదేవపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలను మహదేవపూర్ తహశీల్దార్ ప్రహ్లద్ రాథోడ్ అప్రమత్తం చేశారు. గెదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు రెండు రోజుల పాటు బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని అన్నారు. మత్స్యకారులు గోదావరి వాగుల వద్దకు వేటకు వెళ్లొద్దని, పశువుల కాపరులు పశువుల మేపుట కొరకు అడవులకు వెళ్లకుండా ఉండాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అడవిలోని వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున అడవులకు వెళ్లొద్దని హెచ్చరించారు. గోదావరి వద్ద చిరు వ్యాపారులు చేసుకుంటున్న వారిని అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థ గృహాలలో నివాసం ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చక్రపాణి, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.